
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 217 | ది. 4-11-2025 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 217 | Date : 4-11-2025 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి



**రంగారెడ్డి జిల్లా,నవంబర్ 3 (వార్తాప్రభ) :** రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మరణించారు. తాండూరుకు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కూతుళ్లు నందిని (డిగ్రీ ఫస్టియర్), సాయిప్రియ (డిగ్రీ థర్డ్ ఇయర్), తనూష (ఎంబీఏ) హైదరాబాద్లో చదువుతున్నారు. ఇటీవల బంధువుల పెళ్లి ఉండటంతో సొంతూరుకు వచ్చారు. ఈ తెల్లవారుజామున తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా బస్సు ప్రమాదం జరిగి చనిపోయారు.

## ఒక్కడి నిర్లక్ష్యం... ఎందరిని బలితీసుకుంది..?




**చేవెళ్ల, నవంబర్ 3 (వార్తాప్రభ) :** చేవెళ్ల మండలం, మిర్జాగూడ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదం కుటుంబాల్లో విషాదం నింపింది. రంగారెడ్డి జిల్లా చెవెళ్ల సమీపంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.మిర్జాగూడ గ్రామం వద్ద కంకరతో నిండిన లారీ, తాండూరు డిపోకు చెందిన టీఎస్ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక మహిళ, ఆమె పది నెలల కుమార్తెతో పాటు ఇరవై మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందారు. లారీ బస్సు ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టడంతో వాహనం పూర్తిగా ధ్వంసమైంది. టన్నుల కొద్దీ కంకర బస్సుపై పడిపోవడంతో అనేక మంది ప్రయాణికులు లోపలే చిక్కుకుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం తెలుసుకున్న వెంటనే చెవెళ్ల పోలీసులు, రక్షణ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. మూడు జేసీబీల సహాయంతో శిథిలాలను తొలగించి చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నాలు చేశారు. దాదాపు యాభై నుంచి అరవై టన్నుల కంకర ఉండటంతో అది మొత్తం ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక చనిపోయారు. ప్రమాద తీవ్రతను బట్టి టిప్పర్ అత్యంత వేగంగా వస్తుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నిర్లక్ష షాద్ నగర్ నుంచి తాండూరుకు ఈ టిప్పర్ కంకర లోడుతో వస్తుంది. 72 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సు మిర్జాపూర్ వంకలోని మలుపు వద్దకు రాగానే టిప్పర్ వేగం అదుపు తప్పి బస్సును ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.. ఓవర్ లోడ్.. ఓవర్ స్పీడ్ తో టిప్పర్ వస్తుందని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. మితిమీరిన వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## చేవెళ్ల ప్రమాదంలో మృత్యువుకు బలయ్యాడు!



**చేవెళ్ల,నవంబర్ 3 (వార్తాప్రభ) :** చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆర్టీసీ బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా కూడా ఉన్నారు. గతంలో తన చాకచక్యంతో అనేక ప్రాణాలను కాపాడిన ఆయన.. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల తోటి ఆర్టీసీ ఉద్యోగులు,అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు గతంలో దస్తగిరి బాబా ప్రదర్శించిన అద్భుత ధైర్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఏడాదిన్నర క్రితం, వికారాబాద్‌లోని అనంతగిరి కొండపై బస్సు బ్రేకులు ఫెయిలయ్యాయి. ఆ సమయంలో దస్తగిరి చాకచక్యంగా వ్యవహరించి, బస్సులోని ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు.అప్పట్లో తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి ప్రయాణికులను రక్షించిన దస్తగిరి.. చేవెళ్ల ప్రమాదంలో మృతి చెందడంపై ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# లండన్‌లో ఫలిస్తున్న సీఎం చంద్రబాబు ప్రయత్నాలు

- రూ.20,000 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన హిందుజా
- ఈవీ తయారీ - నెట్వర్క్ ప్లాంట్ల ఏర్పాటుకు అంగీకారం
- విశాఖ విద్యుత్ కేంద్రంలో మరో 1,600 మె.వా. సామర్ధ్యం పెంపు
- సీఎం సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో హిందుజా ఒప్పందం





**లండన్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులను స్వాగతించేందుకు వరుసగా పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశం అవుతున్నారు. సోమవారం లండన్‌లోని ది లాంగ్లీ, బకింగ్‌హామ్‌షైర్‌లో హిందుజా గ్రూప్ చైర్మన్ అశోక్ హిందుజా, ఆ సంస్థ యూరప్ చైర్మన్ ప్రకాశ్ హిందుజాతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను ముఖ్యమంత్రి ముందుగా వారికి వివరించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హిందూజా గ్రూప్‌తో కీలక ఒప్పందం కుదిరింది. దశలవారీగా ఏపీలో రూ.20 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టాలని హిందూజా గ్రూప్ నిర్ణయించుకుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందంపైనా సంతకాలు చేసింది.

**ప్రధాన ప్రాజెక్టులు :** విశాఖలోని హిందూజా సంస్థకు ప్రస్తుతమున్న 1,050 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌కు అదనంగా మరో 1,600 మెగావాట్ల వరకు సామర్థ్యాన్ని విస్తరించనుంది. ఒకొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు కొత్త యూనిట్లను స్థాపిస్తుంది. అలాగే రాయలసీమలో భారీ సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తుంది. మరోవైపు ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు, లైట్ కమర్షియల్ వాహనాల తయారీ లక్ష్యంగా కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ నెలకొల్పనుంది. వీటితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా EV ఛార్జింగ్ నెట్‌వర్క్ తీసుకురానుంది. ఇది రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్ స్థాపనకు అనంతపురం, కర్నూలు, అమరావతిని హిందుజా పరిశీలించనుంది. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో హిందుజా గ్రూప్ పెట్టుబడులు కీలకం అవుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతి కోసం అత్యుత్తమ వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. హిందుజా గ్రూప్ ప్రతిపాదనలు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా ప్రత్యేకంగా ఫాస్ట్-ట్రాక్ విండో ఏర్పాటు ద్వారా ట్రాక్ చేస్తామని హిందుజా ప్రతినిధులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్

- హస్త కళల కళాకారులకు రాష్ట్ర స్థాయి అవార్డులతో సన్మానం
- హస్తకళలు అంతరించిపోకుండా పరిరక్షించాలి
- గాంధీ శిల్ప బజార్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల





**హైదరాబాద్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ లు ఆకట్టుకునేలా నిలుస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం నాడు తెలంగాణ హస్తకళల అభివృద్ధి కార్పోరేషన్ లిమిటెడ్ భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హెచ్. ఎం డీ. ఏ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను వ్యవసాయ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అంతరించిపోతున్న హస్త కళలను పరిరక్షించాలని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం హస్త కళాకారులకు ఉపాధి దొరికేలా అవకాశాలు కల్పించాలని వెల్లడించారు. ఎంతో ప్రత్యేకమైన హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ లను, చేనేత ఉత్పత్తు లను పుణ్య క్షేత్రాలు, ఎయిర్ పోర్టులు రైల్వే స్టేషన్లలో లాంటి ముఖ్యమయిన ప్రాంతాలలో ఏర్పాటు చేసి బాగా ప్రమోట్ చేయాలని మంత్రి తుమ్మల సూచించారు.ఈ ఎగ్జిబిషన్ లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుమారు 150 హస్త కళల మరియు చేనేత ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేసినారు. ఈ సంధర్భంగా మంత్రి 2024-25 సంవత్సరమునకు గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది హస్త కళల కళాకారులకు రాష్ట్ర స్థాయి అవార్డులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్ టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజ రామయ్యర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ సువార్చల రాణి పాల్గొన్నారు.

# పార్టనర్ షిప్ సమ్మిట్ లో రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

- 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు ఇప్పటికే సమాచారమిచ్చారు
- డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ వల్లే రాష్ట్రానికి భారీ పరిశ్రమల రాక
- విద్వేషాలు రెచ్చగొడుతున్న వైసీపీ... అన్నీ ప్రజల ముందు ఉంచుతున్నాం
- నవంబర్ లో ప్రధాన పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ సన్నాహక చర్యలపై మంత్రి నారా లోకేష్




**అమరావతి,నవంబర్ 3 (వార్తాప్రభ) :** విశాఖపట్నంలో ఈ నెల 14,15 తేదీల్లో పార్టనర్ షిప్ సమ్మిట్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతోన్నాం. ఈ సదస్సులో పెద్దఎత్తున పెట్టుబడి చర్చలు జరుగుతాయి. పారిశ్రామికవేత్తలతో పాటు పాలసీ మేకర్లు హాజరైరాబోయే పదేళ్లలో పారిశ్రామికరంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయి, అందులో భారత్, ఆంధ్రప్రదేశ్ పాత్ర ఏమిటి అనే అంశాలపై విస్తృతమైన చర్చలు జరుగుతాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ నెల 14-15 తేదీల్లో విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ %-% 2025 సన్నాహక ఏర్పాట్లపై మంత్రి లోకేష్ ఉన్నతస్థాయి సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎక్సైజ్, గనులశాఖల మంత్రి కొల్లు రవీంద్ర, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ... పార్టనర్ షిప్ సమ్మిట్ కు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, పీయుష్ గోయల్, అశ్వనీ వైష్ణవ్ లాంటి కేంద్ర మంత్రులు హాజరు కానున్నారు. ఇప్పటివరకు 45దేశాల నుంచి 300మంది వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు వస్తున్నట్లు మాకు సమాచారం ఉంది. సమ్మిట్ లో 12 మల్టీ లాటరల్ ఆర్గనైజేషన్స్, 72మంది ఇంటర్నేషనల్ స్పీకర్స్ పాల్గొంటారు. 48 స్పీకింగ్ సెషన్స్ లో సెక్టార్లవారీగా వివిధ అంశాలపై విస్తృతంగా చర్చలు జరుపుతాం. ఈసారి పార్టనర్ షిప్ సమ్మిట్ లో 410 ఎంవోయూలపై సంతకం చేయబోతున్నాం. వీటిద్వారా రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5లక్షల ఉద్యోగావకాశాలు రాబోతున్నాయి.

**యువగళంలోనే 20లక్షల ఉద్యోగాల హామీ..** నేను యువగళం పాదయాత్రలో రాష్ట్రవ్యాప్తంగా 3,132 కి.మీ.లు నడిచాను. పాదయాత్ర సమయంలో జీడి నెల్లూరు నియోజకవర్గం శివారులో మోహన అనే తల్లిని కలిశాను. బోండాలు అమ్ముకుంటూ జీవనం సాగించే ఆమె భర్త మద్యానికి బలికాగా, కాయకష్టం చేసుకుని 30 ఏళ్లపాటు పిల్లలను పెంచి పెద్దచేసింది. తమ ఇద్దరి బిడ్డలకు ఉద్యోగాలు ఇస్తే చాలని ఆ తల్లి చెప్పింది. హలో లోకేష్ కార్యక్రమంలో కూడా యువతకు ఉద్యోగాలు కల్పిస్తే సమాజంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పాను. కూటమి ప్రభుత్వం వచ్చాక 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చా. ఆ హామీని నెరవేర్చేందుకు మంత్రులందరం మిషన్ మోడ్ లో పనిచేస్తున్నాం.

# ధర్మపురి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాలకు సకల ఏర్పాట్లు
- ఆలయ మాస్టర్ ప్లాన్ రివ్యూలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** జగిత్యాల జిల్లాకు చెందిన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు కూడా సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మపురి ఆలయ మాస్టర్ ప్లాన్ పై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ రివ్యూ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంటు డైరెక్టర్ హరీష్, డిపార్టుమెంటు ఉన్నతాధికారులు, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... వందలాది సంవత్సరాలు చరిత్ర గల ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమశాస్త్రం, వేద పండితులు, స్థానికుల, భక్తులు మనోభావాలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురిలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వయంభు మూర్తి, ఋషులు, దేవతలు సంచరించిన పవిత్ర ప్రాంతం, ఈ అంశం దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. దాంతోపాటు, 2027 జూలై లో రానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధర్మపురిలోని గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని మంత్రి ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్ కు అవసరమైన స్థల సేకరణ వివరాలు మంత్రి, అధికారులను అడిగి సంపూర్ణంగా తెలుసుకున్నారు. స్థల పురాణం ఆధారంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం రూ. 50 కోట్లతో చేపట్టే నిర్మాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని చెప్పారు.

**సురేఖ అక్కకి ప్రత్యేకంగా ధన్యవాదాలు..** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... తన సొంత నియోజకవర్గంలో కొలువై ఉన్న స్వామివారి ఆలయాన్ని విస్తృతంగా అభివృద్ధి పరుస్తున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇంత పని ఒత్తిడిలోనూ తమ టెంపుల్ కోసం ప్రత్యేకంగా టైం కేటాయించి... అభివృద్ధి చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ టెంపుల్ కోసం అయ్యే స్థల సేకరణకి సంబంధించిన అంశాల్లో తాను ప్రత్యేకంగా చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు. అందరి సహకారంతో గోదావరి పుష్కరాలు కూడా విజయవంతంగా చేస్తామని హామీనిస్తున్నట్టు వెల్లడించారు.

# నేతన్నల అభివృద్ధే లక్ష్యం

-రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత





**తాడేపల్లి/అమరాతి,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నేతన్నలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను చేనేత ఐక్య కార్యాచరణ సమితి నేతలు సోమవారం కలిసి, పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేత రంగానికి టీడీపీ పాలన స్వర్ణయుగం వంటిదన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నలకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ విక్రయాలు పెంచేలా చర్యలు తీసుకుందన్నారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన నేతన్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. నూలు, ఇతర రసాయనాలు తడిచిపోయిన నేతన్నలకు రూ.5 వేలు చొప్పున్న అందజేస్తున్నామన్నారు. మత్స్యకారుల మాదిరిగా నేతన్నలకు 50 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు, బంగాళదుంపలు, పంచదార కేజీ చొప్పున అందజేస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో నేతన్నలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వినతిపత్రంల పేర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో చేనేత ఐక్య కార్యాచరణ సమితి పిల్లలమర్రి నాగేశ్వరరావు, పి.బాలకృష్ణ, రామనాథం పూర్ణచంద్రరావు, కె.కోటేశ్వరరావు, జి.బాలాజీ, కె.కుమారి, డి.రామారావు, జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణ ప్రతిష్ట చేసే డాక్టర్ కైన ఓనమాలు దిద్దించిన గురువే మూలం - ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్



**విస్సన్నపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఉపాధ్యాయుడు అంటే మట్టిలో ఉన్న మాణిక్యాలను వెలికి తీసి అత్యంత అందమైన ఆభరణాలుగా తీర్చిదిద్దే వృత్తి అని నేను నమ్ముతానని విసన్నపేట ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్ అన్నారు. చిన్నారులకు బాల్యంలో అక్షరాభ్యాసం చేసిన సమయం నుండి ఉన్నత విద్య తదనంతరం పోటీ పరీక్షలకు తీర్చిదిద్దే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఎంపీపీ చెప్పారు. ప్రతి బిడ్డకు తొలి గురువు మాతృమూర్తి అయిన ఆ బిడ్డ అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు ప్రతి విద్యార్థికి దిక్సూచి వంటి మహోన్నత వ్యక్తి ఉపాధ్యాయుడు అని చెప్పాలని ఇది సర్వత్రా తెలిసినదేనని ఎంపీపీ తెలియజేశారు. ఎవరు ఎంత ఎత్తు ఎదిగినా దానికి మూలం వాళ్లకి చదువు చెప్పిన ఉపాధ్యాయులేనని ఎంపీపీ చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో వివిధ పదవులు అలంకరించి మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించి రిటైర్మెంట్ జరుపుకుంటున్న మా శ్రేయోభిలాషి చదల రామకృష్ణ సలహాలు ఆయన ప్రసంగాలు నేటి సమాజానికి అవసరమన్నారు.

## నీటి సంఘం అధ్యక్షుడు రామస్వామికి సత్కారం



**మచిలీపట్నం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** బందరు యాదవ సోదరుల కార్తీక వన సమారాధన సందర్భంగా బుద్దాలపాలెం నీటి సంఘం అధ్యక్షుడు కుంభం రామస్వామిని ఆదివారం ఘనంగా సత్కరించారు. బలరామునిపేట లోని గాంధీ విద్యాలయం లో కార్తీక వనసమారాధన జరిగింది. ఈసందర్భంగా రామస్వామిని నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమం లో వేమూరి నాగార్జున కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల అభివృద్ధికి కృషి చేసిన డొప్ప

### -సింహాచల యాదవ్ సేవలు చిరస్మరణీయం



**రాజాం, నవంబర్ 3 (వార్తాప్రభ) :** యాదవుల అభివృద్ధి కోసం యాదవుల అభివృద్ధి కోసం కృషి చేసిన రాజాం యాదవ సంఘం అధ్యక్షుడు డొప్ప సింహాచలం యాదవ్ చిరస్మనీయమని, వారి కుటుంబాన్నీ అన్ని విధాలుగా ఆదుకుంటామని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్దిబోయిన గురునాద్ యాదవ్ అన్నారు. సోమవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గ అధ్యక్షులు డొప్ప సింహాచలం యాదవ్ ఇటీవల మృతి చెందారు. మరణ వార్త తెలుసు కొని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్దిబోయిన గురునాద్ యాదవ్ వారి కుటుంబాన్ని పిల్లలు చదువు విషయం కు ఆర్థికంగా అండగా ఉంటామని , యాదవుల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. నిరంతరం యాదవుల ఏ చిన్న సమస్య వచ్చినా వాటిని పరిష్కారానికి ఆయన ముందు ఉండే వారిని జిల్లా అధ్యక్షులు కృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్ అన్నారు. కుటుంబాన్ని పరామర్శించే వారిలో రాష్ట్ర కార్యదర్శి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 6వ తేదీన మోటార్ సైకిల్ వేలం పాట

**జి.కొండూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** అన్ క్లయిమ్ మోటార్ సైకిల్ హీరో స్టన్నర్ సిబిఎఫ్ (CBF) 2016 మోడల్ కి సంబందించి నవంబర్ 6వ తేదీ గురువారం జి.కొండూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వ్యక్తులు మోటార్ సైకిల్ వేలం పాటలో పాల్గొనవచ్చు అని తెలియజేశారు.మరిన్ని వివరాల కోసం జి.కొండూరు పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

## లక్ష్మణరావు మృతి బీసీలకు తీరని లోటు



**శ్రీకాకుళం, నవంబర్ 3 (వార్తాప్రభ) :** సీనియర్ పాత్రికేయులు ,జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు మృతి తీరని లోటని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి గద్దిబోయిన గురునాథ్ యాదవ్ అన్నారు. సోమ వారం రాగోలు లో లక్ష్మణరావు నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదు చారు. బీసీల అభివృద్ధికి,బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. పరామర్శించిన వారిలో బీసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బడానా దేవభూషణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దిబోయిన కృష్ణారావు, కళింగ వార్త ఎడిటర్ ,రాష్ట్ర కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

# మధుమేహం నిరోధం మన చేతుల్లోనే

### -ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వి.బి.కాశ్యప జన్నాభట్ల

**గుంటూరు టౌన్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** సమాజంలో నేడు వేగంగా వ్యాప్తి చెందుతున్న మధుమేహం నిరోధం చాలావరకు మన చేతుల్లోనే, చేతల్లోనే ఉందని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వి.బి. కాశ్యప జన్నాభట్ల అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక 2/1బ్రాడీపేట లోని ఎస్.హెచ్.ఓ. సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ,మధుమేహ నిరోధక మాసం సందర్భంగా "మధుమేహం -కారణాలు- నిర్ధారణ పరీక్షలు -చికిత్స- నిరోధక మార్గాలు "అనే అంశంపై నిర్వహించిన శాస్త్రీయ అవగాహన సభ, ఉచిత వైద్య సలహా శిబిరంలో డాక్టర్ కాశ్యప జన్నాభట్ల ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు .సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ,అధ్యక్షులు డాక్టర్ టి.సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కాశ్యప జన్నాభట్ల ప్రసంగాన్ని కొనసాగిస్తూ మధుమేహంకు జీన్స్ (జన్యుల)కు సంబంధం ఉందన్నారు. ఒకప్పుడు శరీరంకు తగినంత ఆహారం దొరకనప్పుడు ,తర్వాత ఆహారం ,ఆహారపు అలవాట్లు, శారీరకవ్యాయామం లేకపోవడం తదితర కారణాలవల్ల జన్యులలో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. మధుమేహం గల వారిలో చాలా కాలం పాటు ఎలాంటి లక్షణాలు బయటపడమని, బయటపడిన తర్వాత కూడా చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారని అన్నారు. వైద్యుని సంప్రదించేసరికే శరీర అవయవాల్లో అనేక అనారోగ్య, నిర్మాణాత్మక మార్పులు జరిగి పోతున్నాయన్నారు . 30 సంవత్సరాలు పైబడిన వారిలో ఇప్పటికే ప్రతి 100 మందిలో 14 మంది ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నారన్నారు. వీరంతా తగిన నిరోధక చర్యలు చేపట్టకపోతే మధుమేహ బాధితులుగా మారి ఆరోగ్య ,ఆర్థిక నష్టాలకు గురికాక తప్పదు అన్నారు .30 సంవత్సరములు దాటిన వారు ప్రతి సంవత్సరం సంవత్సరాలకు ఒకసారి అయినా మధుమేహ పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు .సభాధ్యక్షులు డాక్టర్ టీ సేవకుమార్ మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరు వయసుతో నిమిత్తం లేకుండా మధుమేహంపై దృష్టి సారించాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు .మనం తీసుకొనే ఆహారంలో సమతుల పోషకాహారం లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు




తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యంగా విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్ లోపాలు రక్తహీనతకు, మధుమేహ నిరోధక ఇన్సులిన్ ఉత్పత్తి చేసేప్యాంక్రియాస్ పరిరక్షణకు అవరోధం కలిగిస్తున్నాయన్నారు . ఈ ప్రజారోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో శాస్త్రీయ చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా తమ సంస్థలు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాక అతి తక్కువ ఖర్చుతో విటమిన్ డి ,బి12 , ఐరన్ లతో పాటు మొత్తం 86 పరీక్షల కంప్లీట్ డయాబెటిక్ ప్రొఫైల్ ను తమ సంస్థ అందిస్తోంది అన్నారు .సమావేశంలో పాల్గొన్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ వ్యాధి బారిన పడిన తర్వాత పరీక్షలు-వైద్యులు -మందులు అనే ఒక విష వలయంలో చిక్కుకుపోకుండా ముందు జాగ్రత్తల పట్ల ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కల్పించాలనే లక్ష్యంతో తమ సంస్థలు ఈ అవగాహన సదస్సులు, సభలు ,వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి అన్నారు. ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. సభలో మానసిక వైద్య నిపుణులు, డాక్టర్ తేజస్విని,దంత వైద్య నిపుణులు ,డాక్టర్ చల్లా చైతన్య ,ఎస్. హెచ్. ఓ .మేనేజర్ పి .నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కే .సతీష్, కోశాధికారి టీ.వీ .సాయిరాం, ఎన్.సాంబశివరావు, చావా శివాజీ, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు . సభానంతరం డాక్టర్ వి.బి .కాశ్యప జన్నా భట్ల మధుమేహ బాధితలను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు.

## కె.వి.ఆర్ జూనియర్ ఒకేషనల్ కాలేజీ ఫీల్డ్ ట్రిప్ విజయవంతం






**విస్సన్నపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కె వి ఆర్ జూనియర్ ఒకేషనల్ కాలేజీ (ఎం ఎల్ టి ల్యాబ్ టెక్నీషియన్) విద్యార్థిని విద్యార్థులకు సంస్థ అధినేత కే వెంకటేశ్వరరావు ( కె.వి.ఆర్ ) ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తయిన తర్వాత శాస్త్రీయ పరీక్షలు మరియు విశ్లేషణలో నిర్వహించడానికి నైపుణ్యం కలిగిన నిపుణులైన పలు ల్యాబ్ ల వద్దకు ఫీల్డ్ ట్రిప్ గా విద్యా ర్థిని విద్యార్థులను తీసుకువెళ్లి అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించటం ఫలితాలను డాక్యుమెంట్ చేయడం ప్రయోగశాలలో పరికరాలను నిర్వర్తించడంలో తీసుకోవలసిన ముఖ్య భూమిక వ్యాధి నిర్ధారణ చికిత్స పర్యవేక్షణ మరియు పరిశోధనలు సీనియర్ టెక్నీషియన్ల సలహాసంప్రదింపులు రోగుల సంరక్షణకు అవసరమైన ఖచ్చితమైన రోగనిధారణ లో కీలకపాత్ర తదితరాలను వారు ప్రత్యక్షంగా సరళంగా అర్థం అయ్యే రీతిలో అవగాహన కల్పించారు.

## ఆయురారోగ్యాలను ప్రసాదించే పూజ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం





**విస్సన్నపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామివారి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం శ్రీ చంద్ర శేఖర స్వామి వారికి ఘనంగా నిర్వహించినట్లు చైర్మన్ వెంపటి శ్రీకృష్ణ జనార్దన రావు తెలియజేశారు. శివదేవునికి విస్తృతమైన అభిషేకమని ఈ పూజా విధానం ద్వారా ఆయుర్ ఆరోగ్యాలను పొందేందుకు భక్తులు విశేషంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పూజలో రెండు ప్రధాన భాగాలు ఉంటాయని మహాన్యాసం దైవిక శక్తులను శరీరంలోకి ఆవాహన చేసే శుద్ధి ప్రక్రియ మరియు రుద్రాభిషేకం వాస్తవ అభిషేకం తరచుగా 11 సార్లు నిర్వహించడం జరుగుతుందని ఈ ఆచారం వలన పాపాలు ప్రతికూల శక్తి మరియు అడ్డంకులను తొలగిస్తుందని ఆరోగ్యం శ్రేయస్సు మరియు ఆధ్యాత్మిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని ప్రతి ఒక్కరు నమ్మడం జరుగుతుందన్నారు. దుష్ట శక్తులు మరియు దుష్టశక్తుల నుండి రక్షణ కవచాన్ని అందిస్తుందని ఆధ్యాత్మిక మరియు వృత్తిపరమైన వృద్ధికి సహాయపడు తుందని తలపెట్టిన కార్యాలు ప్రయోజనకరంగా శీఘ్రగతిన పురోగమన దిశలో ముందుకు వెళతాయి అన్నారు. శివుడు లేదా రుద్రుని లింగ రూపంలో పాలు పెరుగు తేనె నెయ్యి పంచదార వంటి 11 ద్రవ్యాలతో అభిషేకించటం వలన వ్యక్తి జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలు గ్రహదోషాలు కారణంగా ఎదురయ్యే బాధలను పాపాలను హరించి వారికి శివానుగ్రహం కలిగి సుఖశాంతులను పొందటానికి కాక విశ్వశాంతికి కూడా రుద్రాభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. రుద్రాభిషేకం వాతావరణంలో వ్యతిరేక ప్రభావాలను ఇచ్చే దుష్టశక్తులను పారదోలి అనుకూల ఫలితాలను ఇస్తుందన్నారు. రుద్రాభిషేకం చేయడానికి ముందు మహన్యాసం చేస్తారని మహన్యాసం శరీరాన్ని మనసును ఆత్మని శుద్ధి చేసే ఒక ప్రక్రియని ఇందులో భక్తుడు తనని తాను ఈశ్వరుని అంశగా భావించుకొని తనలోని ఈశ్వర తత్వాన్ని మంత్రపూర్వకంగా ఆవాహన చేసుకోవడం ద్వారా పరిశుద్ధుడు అవుతాడని ఎలా తానేరుద్రుడు అంశాన్ని భావనతో రుద్రాభిషేకం చేయడానికి అధికారాన్ని సంపాదించుకోవడం జరుగుతుందన్నారు. మనః కారకుడైన చంద్రుడు ప్రభావం అధికంగా ఉండే సోమవారం నాడు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేస్తే అది విశేషమైన ఫలితాలు ఇస్తుందని మన గ్రంధాలు ద్వారా చెప్పడం జరుగుతుందన్నారు. కార్తీక మాసంలో శైవ భక్తులు విష్ణు భక్తులు కూడా భక్తిశ్రద్ధలతో విశిష్ట పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ మాసంలో ప్రత్యేకించి సూర్యోదయానికి ముందు చేసే స్థానాలు ఆ తర్వాత చేసే దానాలు ఉపవాసాలు గొప్ప శక్తి ఉంటుందని స్కంద పురాణం అంతర్గతంగా ఉన్న కార్తీక పురాణం వివరిస్తుందని వశిష్ట మహర్షి జనక మహారాజుకు ఈ విషయాలన్నిటిని విపులీకరించటం వాటిలో సోమవారం వ్రతాన్ని దాని శక్తిని మరింత ఎక్కువగా తెలియజేశారని ఈ విషయాలన్నీ కార్తీక పురాణంలో పొందుపరిచారన్నారు.

## లయనిజం ద్వారా విస్తృతంగా సేవలందించాలి

### - లైన్స్ జిల్లా గవర్నర్ ఆంజనేయులు




సదస్సు లో పాల్గొన్న లైన్స్ జిల్లా గవర్నర్ ఆంజనేయులు

**మైలవరం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** లయనిజం ద్వారా విస్తృతంగా సేవలు అందించాలని లయన్ 316డి జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణాజిల్లా,లయన్ సెకండ్ క్యాబినెట్ సమావేశం ఆదివారం రాత్రి స్థానిక ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో జరిగింది.ఈ సందర్భంగా ఈ ఏడాది కాలంలో లయన్స్ క్లబ్బుల ద్వారా చేయవలసిన సేవా కార్యక్రమాల గురించి సమావేశంలో చర్చించారు.అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లైనిజం ఉందన్నారు. లయ నిజం అంటేనే సేవా అని ఆ సేవ ద్వారానే గుర్తింపు వస్తుందన్నారు. వివిధ లైన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో పర్మినెంట్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి వివిధ వర్గాల వారికి సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐ పి ఎం సి సి దామర్ల శ్రీ శాంతి,జిల్లా ఫస్ట్ గవర్నర్ ఎన్ వి విఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ మెంబర్ సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, జెడ్ సి తిరుమల శెట్టి శ్రీధర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం పివిస్టి లు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలవాది హరీష్ కుమార్ గుప్తా, జిల్లా నుండి లైన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## పంచాయితీ పన్నులను ఆన్లైన్ ద్వారా చెల్లించే విధానం ను సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** గ్రామ పంచాయతీకి సంబంధించి పన్నులు ఆన్లైన్ ద్వారా చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసిందని, ఈ వెసులుబాటును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ పర్హిన్ జాహిద్ లతో కలిసి స్వర్ణ పంచాయితీ- నిమిషాల్లో పన్నులు చెల్లించండి పేరుతో రూపొందించిన గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సోమవారం నుండి ఆన్లైన్ పద్ధతిలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లించే నూతన విధానం ప్రారంభించిందన్నారు. ఈ పద్ధతిలో సులభంగా పంచాయతీ పన్నులన్నీ చెల్లించవచ్చన్నారు. ప్రతి పంచాయతీ కార్యాలయము సచివాలయం ప్రభుత్వ కార్యాలయాల్లో గోడపత్రాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని పన్నులను చెల్లించాలని జిల్లా కలెక్టర్ కోరారు. దీంతో ప్రజలకు ఇంకా మెరుగైన పౌర సేవలు అందించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డాక్టర్ జె అరుణ, మచిలీపట్నం ఆర్డిఓ స్వాతి, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, సీఐ శ్రీను పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రేపు పెడన నియోజకవర్గం కు రానున్న మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి



**పెడన,నవంబర్ 3 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో తీవ్ర విషాదం నింపిన ముంధా తుఫాన్ వలన నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వారికి ధైర్యం చెప్పడానికి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 4వ తేదీన పెడన నియోజకవర్గం కు రానున్నారు. ప్రభుత్వము రైతులకు వెంటనే సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 4 న న పెడన నియోజకవర్గం లోని తరకటూరు నుండి రామరాజుపాలెం వరకు తుఫాన్ వల్ల నష్టపోయిన వారి పొలాలను పరిశీలించనున్నారు. రైతులకు న్యాయం జరిగేలా వారి పక్షాన పోరాడేలా పర్యటన చేస్తున్నారని నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ఉప్పాల రాము తెలిపారు. పార్టీలోని అన్ని విభాగాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అందరూ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## కాకర్లమూడి లో పేదలకు దుప్పట్ల పంపిణీ



**పెడన,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెడన నియోజవర్గ జనసేన నాయకులు లింగం నాగేశ్వరావు ఎల్ వి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెడన నియోజకవర్గం లోని కాకర్లమూడి గ్రామంలో పేదలకు దుప్పట్లు పంపిణీ జరిగింది. యానదుల కాలనీలో ఎస్ సి కాలనీలో 100 మందికి దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తి తో శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ సూచన మేరకు ఈ సేవా కర్యక్రమాలను నిర్వాహిస్తున్నట్టు ఫౌండేషన్ నిర్వాహకులు లింగం నాగేశ్వరావు వార్తప్రభ ప్రతినిధికి తెలిపారు.

## ఆర్కే కన్వెన్షన్ లో ఈ నెల 8వ తేదీ మహా పడిపూజ మహోత్సవం..

### -ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు ఉదయ్ ఆహ్వానం




**చల్లపల్లి/అవనిగడ్డ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** చల్లపల్లి మండలం మేకా వారి పాలెంలోని ఆర్కే కన్వెన్షన్ ఆవరణలో ఈ నెల 8వ తేదీ మహా పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్కే కన్వెన్షన్ అధినేత, రావెళ్ల కృష్ణ సేవా సమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదును మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందచేసి కార్యక్రమానికి ఆహ్వానించారు. చల్లపల్లి మండలం పాగోలు శివారు మేకావారిపాలెంలోని ఆర్.కే కన్వెన్షన్ ఆవరణలో మహా పడిపూజ కార్యక్రమం జరపనున్నట్లు తెలిపారు. తన 18వ సారి అయ్యప్ప దీక్ష సందర్భంగా తమ ఆర్కే కన్వెన్షన్ ఆవరణలో 18 మెట్ల కలశ పూజ , ఉదయం 10గంటలకు అయ్యప్ప స్వామి వారికి 18 రకాల అభిషేకాలు, రాత్రి 7 గంటలకు మహా పడిపూజ మహోత్సవం , అనంతరం స్వామివారి తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్ కుమార్,రావెళ్ళ కృష్ణ సేవా సమితి ప్రతినిధి పరుచూరి సురేష్ బాబు, కృష్ణమోహన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ ని సత్కరించిన వార్తాప్రభ ప్రతినిధి



**గుంటూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ప్రజా సేవ చేయాలనే సంకల్పం హృదయములో పదిలమైన ఉంటే అసాధ్యము కాదన్న కార్యాచరణాన్ని మెళుకువలతో సుచాయనంగా చేధించవచ్చు నన టానికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాలే నిదర్శనం.... వివరాల్లోకి వెళ్ళితే ఇటీవల బంగాళా ఖాతంలో ఉద్భవించిన వాయుగుండం చిలికి చిలికి గాలివానగా ఏర్పడి "మొంథా తుఫాను" గా దారితీసిన నేపథ్యంలో తాను జిల్లా పోలీస్ అధికారిగా కొనసాగుతున్న గుంటూరు జిల్లాలోని అన్ని పట్టణాలతో పాటు ఏ మారుమూల గ్రామాల్లోని ప్రజలు తుఫాను బారిన పడి ముంపుకు గురికాకూడదన్న ధృడ సంకల్పంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మబ్బుకు రంధ్రం పడట్టుగా ఎడతెరిపి లేకుండా ఈదురు గాలులతో పాటు ఏనుగు తొండమంత ధారతో ఒకటేపనిగా పడిన వర్షాలకి నదులు, వాగులు, లోతట్టు ప్రాంతాలు అన్నియును జలసాంద్రతతో నిండిపోయి పరవళ్ళు తొక్కుతున్న సమయమందు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో తన సిబ్బందితో కలిసి అలుపు చొలుపు విధులకు తావ్వీవకుండా అహర్నిశలుగా ఎంతో ధైర్యంగా ఎక్కడికక్కడే మెళుకువలతో కూడిన సాహసోపేతమైన విధులను నిర్వర్తించి జిల్లాలో ఎక్కడా కూడా ప్రజా ప్రాణహాని కలగకుండా ఎంతో క్రమశిక్షణతో చాకచక్యంగా వ్యవహరించి ఇటు ప్రజల ప్రాణాలకు అటు ప్రభుత్వానికి ఏ లోటు పాటులు తలెత్తకుండా అపారమైన రక్షణ సౌభాగ్యం కల్పించి పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా కలిసి మెలిసి ఎల్లకాలం పాటు హాయిగా వర్ధిల్లటానికి తమవంతు విధుల కర్తవ్యంగా విశేష శ్రమ చేసి చెమటోడ్చిన వకుల్ జిందాల్ మహాశయులు వారిని సోమవారం నాడు వారి కార్యాలయంలో కృతజ్ఞతా భావంతో కలుసుకొని అటు ప్రజల తరుపున ఇటు "వార్తాప్రభ" తెలుగు దినపత్రిక తరుపున అభినందనలు తెలుపుట జరిగింది.

# సి.ఐ. చిన కొండలరావు కి అరుదైన అవార్డు ప్రధానం

● సైక్లోన్ మొంధా ఫైటర్ అవార్డు గ్రహీత సి ఐ కి ఆత్మీయ సత్కారం



(యేమినేని వెంకట రమణ)

**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నీ కర్తవ్యాన్ని నివ్వు నిస్వార్థంగా నిర్వహించు ఫలితాన్ని ఆశించకు అనే పెద్దలు హితబోధను తూ చ్చా... తప్పకుండా పాటించిన వారికి విజయాలు కానీ కీర్తిప్రతిష్ఠలు కానీ వాటంతటిగా అనే వెంటాడుతూ వస్తాయనే విషయం కొత్తపేట సి ఐ చిన కొండలరావు విషయంలో రుజువైంది. ఇటీవలే రాష్ట్రాన్ని, కోస్తా తీర ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన ముందా తుఫాను లో పోలీసు కమిషనర్,జిల్లా కలెక్టర్ ఆదేశాలు తూ చా తప్పకుండా పాటిస్తూ ఇద్దరు వృద్ధ దంపతులు ప్రాణాలు కాపాడిన సంఘటన తెలిసిందే.. జోరు వాన ...ఈదురు గాలులు లెక్కచేయకుండా కొండప్రాంత సుమారు 200 మెట్లు ఎక్కి అక్కడున్న వృద్ధ దంపతులను పునరావాస కేంద్రానికి తరలించగా అప్పటివరకు ఓ పూరింట్లో వున్న వృద్ధులు బయటకు రాగానే ఆ యిల్లు రిటైనింగ్ వాల్ తో సహా నేలమట్టంమైన సంఘటన లో సి ఐ చిన కొండలరావు, ఆయన సిబ్బంది కి సి పి రాజశేఖర్ బాబు అభినందించిన విషయమూ తెలిసిందే.. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా సి ఐ కి సైక్లోన్ ముందా ఫైటర్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సోమవారం లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్ ఆధ్వర్యంలో కొత్తపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ చిన్నకొండలరావు కి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మెంన్న జరిగినటువంటి తుఫాను కారణంగా చేస్తున్నటువంటి సేవకులను "సైక్లోన్ మోందా ఫైటర్" అవార్డును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకొని వారికి అభినందనలు తెలియచేయడం జరిగింది ఈ సేవా కార్యక్రమంలో గత 30 సంవత్సరాలుగా చేయనటువంటి గొప్ప సేవ పోలీసు వారు చేయడం పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న కొండ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలకు అప్రమత్తం చేసి వారిని కురుణామస పునరావస కేంద్రాలకు పంపించి ఎంతో మందిని ఆదుకోడి ఎటువంటి ప్రమాదం జరగకుండా చేయడం చాలా ఆనందదాయకమని చెప్పి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎన్వి రావు, అధ్యక్షులు బాబురావు, సెక్రటరీ బి ఎస్ కే పట్నాయక్ మాజీ అధ్యక్షులు ఎస్ ఈశ్వరరావు మరో మాజీ అధ్యక్షులు నమ్మి అప్పారావు, కార్యదర్శి వేముల వెంకట్రావు తదితరులు పాల్గొని సి ఐ ని ఘనంగా సత్కరించారు.

# నేటి తరం ఉద్యోగులకు ఆదర్శనీయం జాస్తి వెంకట లక్ష్మి సేవలు

-రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ ఎస్ ఢిల్లీ రావు





**విజయవాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖ లో అత్యంత సమర్ధవంతం గా సేవలందించి అధికారుల మన్నల పొందిన జాస్తి వెంకట లక్ష్మి ని నేటి తరం ఉద్యోగుల ఆదర్శం గా తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎస్. దిల్లీరావు అన్నారు. విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం, లైబ్రేరియన్ గా పనిచేసి యిటీవల పదవీ విరమణ చేసిన జాస్తి వెంకట లక్ష్మి కి తాడేపల్లి లోని కొండపావులూరి గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన అభినందన కార్య క్రమానికి పౌర సరఫరాల డైరెక్టర్ ఎస్.ఢిల్లీ రావు, ఎ.పి.ఎన్ జి ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ లు హాజరై వెంకటలక్ష్మి ప్రసాద్ దంపతులను సన్మానించి అభినందనులు తెలిపారు. ఈ మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలు గా వెంకట లక్ష్మి ఉద్యోగ భాద్యతలను నిర్వర్తిస్తూ తమదైన శైలిలో సేవలు అందించారని అన్నారు .ఆమె అందించిన సేవలు నేటి తరం వారికి స్పూర్తిగా నిలుస్తాయని అన్నారు.ఎన్ జి ఓ నేత విద్యా సాగర్ మాట్లాడుతూ ప్రభుతవానికీ ప్రజలకు వారిది లా నిలిచే సమాచార శాఖలో పనిచేసే ఉద్యోగులు సమర్ధవంతం గా పనిచేస్తేనే ప్రభుత్వాని మంచి పేరు వస్తుందన్నారు. వెంకట లక్ష్మి, ప్రసాద్ దంపతులు యిరువురు సమాచార శాఖ లో పని చేసి ప్రజా పతినిధులు ఉన్నతాధికారుల పర్యటనలకు సంబంధించి సమాచారం ఎప్పటికప్పుడు మీడియా అందజేయటం మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మంచి సేవలు అందించారన్నారు. కార్యక్రమం ఎన్ జి ఓ నేతలు కె.జగదీశ్వర రావు, డి ఎస్ ఎన్ రెడ్డి, పి.రమేష్, సి వి ఆర్ ప్రసాద్, నజీరుద్దీన్, రివర్ బ్రిజ్ అపార్టుమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# డిసిల్టింగ్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

-విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** డిసిల్టింగ్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్, కేటీ రోడ్, గణపతి రావు రోడ్, చిట్టినగర్ స్వరంగం, కబేళా, ఎర్రకట్ట, ధర్నా చౌక్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు డీసిల్టింగ్ పనులు కచ్చితంగా జరగాలని, డీసిల్టింగ్ వ్యర్థాలను వెంటనే తొలగించాలని, ప్రతిరోజు త్రాగునీటి పరీక్షలు కచ్చితంగా జరగాలని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, రోడ్డుపైన గుద్దలు లేకుండా చర్యలు తీసుకోవాలని, మొక్కల శాతాన్ని పెంచాలని, పొంగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు.తదుపరి ధర్నాచౌక్ లో గల అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్న కాంటీన్ కి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, త్రాగునీటి సౌకర్యం వాడుకునీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం ఉండరాదని, అన్న క్యాంటీన్లో ఏవైనా మర్మతులు ఉంటే వాటిని పూర్తి చేయాలని అన్న క్యాంటీన్ లో సమయపాలన కచ్చితంగా చేయాలని, ఆహార నాణ్యతలో ఎటువంటి లోపం ఉండరాదనీ అన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానెర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి:-కడప జిల్లాకలెక్టర్ శ్రీధర్

●అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి..! ● జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
● జిల్లా అధికారులు పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





(సి.రాజా రెడ్డి)

**కడప,నవంబర్ 3:-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సభ భవన్ నందు .. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జిల్లా అధికారులు పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అందించాలన్నారు.ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో పీజిఆర్ఎస్ పెండింగ్ అర్జీల పై సమీక్ష చేశారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..** 1) కొండాపురం మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన వెంకట నాగలక్ష్మి అని నేను అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సూపర్వైజర్ గా పని చేస్తున్నానని ఇటీవల ఉద్యోగం నుంచి తొలగించారని,నాకు ఎంఎబీఈడీ క్వాలిఫికేషన్ ఉన్నందున ఏదైనా కాంట్రాక్ట్ ప్రాధిపథకన టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

2) చిమ్మామియా పేటలోని అబ్దుల్ రౌఫ్ ఐడియల్ గ్లోబల్ స్కూల్ నందు మా ఇద్దరి కూతుర్లను చేర్పించామని కొన్ని అనివార్య కారణాలవల్ల స్కూలు మార్చడం జరిగిందని కానీ వారు టీసీ ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని, డీఈవో చెప్పిన టీసీ ఇవ్వడంలేదని, మా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని టీసీ ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి,జడ్పీ సీఈఓ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ కుమార్,డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మార్కాపురం విద్యార్థినిలు



**మార్కాపురం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఒంగోలులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగినటువంటి ఐదు డివిజన లు చీరాల, ఒంగోలు, కందుకూరు, కనిగిరి, మార్కాపురం పరిధిలో జరిగినటువంటి చెస్ పోటీలలో మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 9 తరగతి విద్యార్థిని షణ్ముఖి మరియు 8వ తరగతి విద్యార్థిని ప్రహేళిక ఇరువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14 సంవత్సరాల లోపు విభాగంలోనూ 17 సంవత్సరాల లోపు విభాగంలోనూ వీరి ఇరువురు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ పిన్నిక జాహ్నవి ప్రియ, పి.ఈ.టి. రోహిణి తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో మంచి విజయం నమోదు చేసి మార్కాపురం కు పేరు తేవాలని అభిలాష వ్యక్తం చేశారు.

# డైవర్షన్ రాజకీయంలో భాగమే జోగి రమేష్ అక్రమ అరెస్టు

-వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్



**విజయవాడ పశ్చిమ, నవంబర్ 3 (వార్తాప్రభ) :** కాశిబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయం లో ప్రభుత్వ వైఫల్యం వల్ల తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో భక్తులు అన్యాయంగా చనిపోయి,అనేక మంది గాయపడితే ఆ విషయంలో బాధ్యత తీసుకుని బాధితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ విషయాన్ని పక్కదోవ పట్టించడానికి డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా వైసిపి నాయకుడు మాజీ మంత్రి జోగి రమేష్ ను అక్రమం గా అరెస్టు చేసిందని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ ఛైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దీన్ విమర్శించారు.నకిలీ మద్యం వ్యవహారంలో కీలకపాత్ర టిడిపి నాయకులదేనని ఒక ప్రక్క తేటతెల్లం అవుతుంటే,గతంలో చంద్రబాబు ఇంటివద్ద జోగి రమేష్ చేసిన నిరసనను మనసులో పెట్టుకున్న చంద్రబాబు నాయుడు నకిలీ మద్యం కేసులో జోగిరమేష్ ను కుట్రపూరితంగా అరెస్టు చేయించారని గౌస్ మొహిద్దీన్ ఆరోపించారు.పోలీస్ కస్టడీ లో ఉన్న నిందితుడు జనార్ధనరావు తో తప్పుడు ఫోన్ సెల్ఫీవీడియో చేయించి,దాని ఆధారంగా అరెస్టు చేసి బూటకపు కేసులు నమోదు చేశారని గౌస్ మొహిద్దీన్ విమర్శించారు.బిసి అయిన జోగి రమేష్ అక్రమ అరెస్టు ద్వారా చంద్రబాబు తన యెక్క బిసిల వ్యతిరేకతను మరోసారి రుజువు చేసుకున్నారని ఎద్దేవా చేశారు.తక్షణమే ప్రభుత్వం జోగి రమేష్ పై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేసి విడుదల చేయాలని లేకుంటే చంద్రబాబు ప్రభుత్వం రాబోయే రోజుల్లో బిసి ల వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ హెచ్చరించారు.

# జోగి రమేష్ అరెస్టును ఖండించిన వైసిపి నాయకులు




**తిరువూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** తిరువూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన వైసీపీ బీసీ నాయకులు ఏడో వార్డు కౌన్సిలర్ బీరువాళ్ళ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులు పై ముఖ్యంగా బీసీ కులాలపై కక్షగట్టి అరెస్టులు చేస్తుంది చంద్రబాబు నాయుడు ఒక మీటింగ్లో చెప్పినట్టు బీసీ కులాలు అంటే ఆయనకి ఆయన క నచ్చట్లేదు జోగి రమేష్ కి కల్తీ మద్యం వ్యవహారంలో ఆయనకు సంబంధం లేదు ఇబ్రహీం పట్టణంలో అక్రమంగా కల్తీ మద్యం తయారవుతుందని బయట పెట్టిందే జోగిరమేష్ ప్రతిసారి ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కడుతున్నాడని ఆయనపై కక్ష కట్టింది కూటమి ప్రభుత్వం అసమర్ధ పాలనలో కాశీబుగ్గలో వెంకటేశ్వర స్వామి దేవాలయం తొక్కిసలాటలో జరిగిన ప్రమాద సంఘటనలో 9 మంది చనిపోగా దాన్ని డైవర్ట్ ను చేయటానికి డైవర్షన్ రాజకీయాలు కూటమి ప్రభుత్వం చేస్తుంది ప్రశ్నిస్తే గొంతులను అరెస్టు చేస్తుంది కల్తీ మద్య వ్యవహారం మొత్తం తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వ్యక్తులే ఉన్నారు వారే స్వయాన ఒప్పుకున్నారు కానీ కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులను టార్గెట్ చేస్తూ అరెస్ట్ చేయటం ప్రజాస్వామ్యాన్ని కూని చేయటమని మండిపడ్డాడు

# ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీతిరుపతమ్మ తల్లి




**పెనుగంచిప్రోలు, నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామం లో ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొందు తున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భంగా రెండవ ఆదివారం నాడు శ్రీ అమ్మవారు పసుపు కొమ్ములతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.వేల సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించు కున్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన గోపి బాబు మాట్లాడుతూ పసుపు కొమ్ముల అలంకరణ లో అమ్మ వారిని దర్శించు కుంటేభక్తులకు సౌ భాగ్యన్ని శుభాని కలుగజెస్తాయని భక్తులు నమ్ముతారని తెలిపారు..

# విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

- ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ల్యాబ్ ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి



**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** సుజనా ఫౌండేషన్, భాగ్య నగర్ గ్యాస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ, పశ్చిమ నియోజకవర్గం, కబేళా లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో రూ 12 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ, బయాలజీ, జువాలాజి , ఫిజిక్స్ ల్యాబ్ లను ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు.. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు,టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ , స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య మరియు కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే సుజనా ల్యాబ్ లను ప్రారంభించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం లో విద్యా వైద్య , రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు చదువుతోపాటు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందేలా సుజనా ఫౌండేషన్ , భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో కెమిస్ట్రీ, బయాలజీ, జువాలాజి, ఫిజిక్స్ ల్యాబ్ లను ప్రారంభించామని తెలిపారు ఈ ప్రయోగశాలల వలన విద్యార్థులకు సైన్స్ పట్ల పరిజ్ఞానం పెరుగుతుందని విద్యార్థిని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాగా చదువుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాలలో మొక్కలను నాటారు.. గతంలో కళాశాలను సందర్శించినప్పుడు విద్యార్థుల కోసం ల్యాబ్ లను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ హఫీజ్ షేక్ అహ్మద్ కోరారని స్థానిక శాసనసభ్యుడిగా , బాధ్యతగా, తన కర్తవ్యాన్ని నిర్వర్తించానన్నారు.. పశ్చిమ లో విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేస్తూ మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు మేధస్సుకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి కోరారు. సహకారం అందించిన భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మాజీ ఏండీ కర్నాటి రామ్మోహన్ రావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తిచేసిన సుజనా ఫౌండేషన్ సిబ్బంది వీరమాచనేని కిరణ్, హరీష్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హఫీజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు వెంకట్, రఫీక్, సుల్తానా, రమణ,రాజేశ్వరరావు, పశ్చిమ నియోజకవర్గం ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పైలా సురేష్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్,మైలవరపు కృష్ణ, పగడాల కృష్ణ, తిరుపతి అనూష, తిరుపతి సురేష్, రెడ్డి పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు..

# విజేతలకు ఆల్ ది బెస్ట్ చెప్పిన ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షుడు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు





**విస్సన్నపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ లో 69 వ ఎస్ సి ఎఫ్ క్రీడలలో 9 మండలాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ చిష్ మెగా, కబాడీ, కోకో అథ్లెటిక్స్ అండర్ 17 14 బాలురు బాలికల విభాగాలలో నరసాపురం హైస్కూల్ నందు 1813 మంది విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు హెచ్ ఎం శోభ లత పిడి రమేష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గన్నవరంలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనే స్థానికంగా గెలుపొందిన విజేతలకు ఆర్.బి.ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శోభలత మాట్లాడుతూ 1813 ఆటలాడే విద్యార్థులకు మూడు రోజులు భోజన సదుపాయంతో పాటు ప్రాంగణం నుండి ఇంటికి వెళ్లే ప్రతి ఒక్కరికి స్వీట్లు పంపిణీ చేసినందుకు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావుకు 9 మండలాల పాఠశాలల విద్యార్థుల తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు పీవీ రామకృష్ణ పాల్గొన్నారు.

# సాహితీ వైద్యుడు రమణ యశస్వి

● రమణ యశస్వి ఆత్మీయ సత్కార సభలో వక్తలు ● జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు' పోస్టర్ ఆవిష్కరించిన పెనుగొండ ● ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ ఘనతను చాటిన కవుల స్వీయకవితాగానం ● పాల్గొన్న ప్రతి కవికీ నగదు పారితోషికం





**గుంటూరు టౌన్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** అటు వైద్యమూ ఇటు సాహిత్యమూ రెండింటినీ కుంటుపడకుండా నడిపిస్తున్న సాహితీ వైద్యుడు రమణ యశస్వి అని వక్తలు ప్రశంసించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అరండల్ పేట ఎస్. హెచ్. వో హాలులో జి.జి.హెచ్ సూపరింటెంట్ డా. రమణ యశస్వి ఆత్మీయ సత్కారం మరియు జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు-2025 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ- వైద్యం కార్పొరేట్ చేతిలోకెళ్ళి పేదవాడికి అందక ఇబ్బందులు పడుతున్న సమయంలో జి.జి.హెచ్ సూపరింటెంట్ రమణ యశస్వి రావడం మంచి పరిణామమన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ సభాధ్యక్షత వహించిన ఈ సభలో రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు, అబాబీలు రూపశిల్పి, సుప్రసిద్ధ సాహితీవేత్త షేక్ కరీముల్లా,సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్ యేమినేని వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు' పోస్టర్ను పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. సత్కార గ్రహీత డా. రమణయశస్వి స్పందన తెలియజేస్తూ- సంవత్సర కాలంగా వృత్తిలో ఎంతో ఒత్తిడికి గురవుతున్న నాకు ఈ ఆత్మీయ సత్కారం ఒక గొప్ప ఊరటనిచ్చిందన్నారు. అనంతరం జరిగిన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ కవి సమ్మేళనంలో పలువురు కవులు స్వీయకవితాగానం చేశారు. ఇందులో పాల్గొన్న ప్రతి కవికీ నగదు పారితోషికం ఇచ్చి, రామరాజు శ్రీనివాసరావు కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. బండికల్లు జమదగ్ని అతిథులకు స్వాగతం పలుకగా, నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరుజిల్లా కార్యదర్శి సయ్యద్ జానీబాషా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# ఒత్తిడిలేని జీవితంతో మంచి ఆరోగ్యం

-ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం సైకాలజీ విభాగం ప్రొఫెసర్ టిడి విమల





**విజయవాడ/జి.కొండూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ప్రతిఒక్కరూ జీవితంలో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదుర్కొనటం సహజమేననీ కానీ ఒత్తిడి రహిత జీవితాన్ని గడపటం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం సైకాలజీ విభాగం ప్రొఫెసర్ టి.డి. విమల అన్నారు.విజయవాడ ఒన్టౌన్లోని ఎస్ఆర్ఎస్వి బీఈడీ కళాశాలలో 'ఎంపవరింగ్ టీచర్స్ యాజ్ మెంటల్ హెల్త్ చాంపియన్స్ ఫర్ స్టూడెంట్స్' అనే అంశంపై కళాశాల సెమినార్ హాలులో గెస్ట్లెక్చర్ జరిగింది.ఈ సదస్సు కు ముఖ్యఅతిథిగా హాజరైన విమల మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా, సామాజికంగా కూడా దృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. డబ్ల్యుహెచ్ఒ ( వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 97 కోట్లకు పైగా ప్రజలు, రకరకాల మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నారని వెల్లడించారు.మన దేశంలో ప్రతి ఆరుగురిలో ఒకరు ఏదో ఒక మానసిక ఇబ్బందికి గురవుతున్న వారేనని గణాంకాలు చెబుతున్నా యన్నారు.కరోనా తర్వాత మానసిక రుగ్మతలు కనీసం 25 శాతం పెరిగాయని పలు పరిశోధనల్లో వెల్లడైందన్నారు. యువతలో మొబైల్ అడిక్షన్, డిప్రెషన్, గ్యాంబ్లింగ్, హింసా రూపాలు వంటి సమస్యలు అధికమయ్యాయని నివేదికలను బట్టి తెలుస్తోందన్నారు. ఆధునిక జీవనం, డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమమేధ వచ్చిన తర్వాత మనుషులంతా వాటిపైనే ఎక్కువగా ఆధారపడాల్సివస్తోందన్నారు. కంప్యూటర్లు, ల్యాప్టాప్లు, సెల్ఫోన్లు, టీవీలను ఎక్కువసేపు వీక్షిస్తుండటంతోపాటు విపరీతంగా పెరిగిన శబ్ధకాలుష్యంతో కూడా ఎక్కువగా మానసిక సమస్యలు పెల్లుబికుతున్నాయన్నారు. బ్లూటూత్లు, హెడ్సెట్లు ఎక్కువ సేపు వినియోగిస్తుండటం వల్ల కూడా వినికిడి వంటి సమస్యలు తాండవిస్తున్నాయని పేర్కొన్నారు. క్రమబద్ధంగా ఆహారం తీసుకోకపోవటం, విశ్రాంతి లేకపోవటం వంటి వాటితో నిద్రలేమి, అలసట, మానసిక ఒత్తిడికి దారితీస్తున్నాయనీ,డిప్రెషన్, ఆందోళన, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎక్కువ మంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మనిషి తన ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రించు కోగలిగి, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, సరైన నిర్ణయాలు తీసుకోగలిగితే ఒత్తిడి ఉండదన్నారు. మానసిక సమస్యలు వచ్చిన ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పలు రకాల చికిత్సల ద్వారా త్వరగా నయం చేసుకోవచ్చునని వివరించారు.ఈ సందర్భంగా ప్రొఫసర్ విమల తన ప్రసంగంతోపాటుగా ఒత్తిడిని తగ్గించేలా పలు కృత్యాలను భావి ఉపాధ్యాయులతో చేయించారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.సతీష్కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు గల ఉపాధ్యాయులను తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.మానసిక స్థైర్యం, ధైర్యం, ఒత్తిడుల ను ఎదుర్కొనే సత్తా వంటి సుగుణాలను పెంపొందిస్తున్నామన్నారు.ప్రశాంతమైన జీవితాన్ని గడిపితే మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు అన్నారు.కళాశాల ప్రెసిడెంట్ ఎం.మోహనరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమనే పెద్దల మాటను నమ్మి ప్రతిఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడులను తగ్గించడానికి, ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కనకదుర్గ మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణలో మానసిక ఆరోగ్యంపై కూడా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు.అనంతరం విద్యార్థినీ విద్యార్థులు రూపొందించిన మేగజైన్ను అతిథులు ఆవిష్కరించారు. అలాగే బీఈడీ విద్యార్థినీ విద్యార్థులు ఆలపించిన పాటలు, గేయాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# రానున్న 2026 లో సంక్రాంతి సంబరాలకు డిసెంబర్ నెలలో పోలీసు శాఖలో అన్ని రకాల ఆటల పోటీలు

●జయహో మహిళా అన్న నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు.

● భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ మహిళా కప్ ను సాధించిన నేపధ్యంలో ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్ నందు సంబరాలు. ● మహిళా పోలీసు అధికారులు మరియు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసిన నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు






**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ప్రపంచ మహిళా కప్ లో దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్టును ఓడించి ఒన్ డే లలో ప్రపంచ కప్ గెలుచుకున్న సంధర్భంగా సోమవారం పోలీసు కమిషనర్ వారి కార్యలయంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మహిళా పోలీసు అధికారులు, పోలీసు క్రీడాకారులు మరియు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సంధర్భంగా నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ......... ముందుగా ప్రపంచ మహిళా కప్ ను సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు తలుచుకుంటే ఏ రంగంలోనైనా ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని సవాళ్ళు ఎదుర్కొన్నా కూడా తన సంకల్పాన్నే ఆయుధంగా చేసి కచ్చితంగా సాధిస్తారని చెప్పడానికి ఈ ప్రపంచ కప్ ఒక నిదర్శనమన్నారు. అదేవిధంగా ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ నందు విధులు నిర్వహించు మహిళా సిబ్బందిలోని క్రీడాకారులందరిని కూడా వారి వారి క్రీడల్లో నైపుణ్యం పెంపొంధిచడానికి ప్రత్యేకంగా అవసరమైన అన్నీ ప్రోత్సాహకాలు అంధిస్తూ ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళా సంబంధిత నేరాలు ముఖ్యంగా పోక్సో కేసులలో, మహిళలు మరియు చిన్న పిల్లలపై జరిగే దాడులు, సైబర్ నేరాల జరుగకుండా ఉండటానికి ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి జాతీయ స్థాయి మహిళా క్రీడాకారులను బ్రాండ్ అంబాసిడర్స్ గా ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. వచ్చే సంక్రాంతి సంబరాల నేపధ్యంలో మహిళలలో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి డిసెంబర్ నెలలో రూరల్ ఏరియాలలో మండల మరియు జిల్లా స్థాయిలలో మహిళలకు వాలీబాల్, కోకో, క్రికెట్, హాండ్ బాల్, బ్యాట్ మింటన్, కబడ్డీ, రన్నింగ్ మొదలైన క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తోపాటు, డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత , ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి , ఎ.సి.పి.లు శ్రీమతి కె.లతాకుమారి , శ్రీమతి ప్రవంతి రాయ్ , మహిళా ఎస్.ఐ.లు, మహిళా పోలీసు క్రీడాకారుణులు మరియు మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ సేవలు భేష్

-నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ



**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** సాహిత్యపరంగానూ, సామాజకపరంగానూ ఎన్నో సేవలందిస్తున్న సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్టు సేవలు అనన్యసామాన్యమైనవని నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల మరియు సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు జూటూరి విజయలక్ష్మి జాతీయ విశిష్ట ప్రతిభా సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగాయి. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కలిమిశ్రీ మాట్లాడుతూ- మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థుల ప్రతిభాపాటవాలను వెలికి తీసేవిధంగా వివిధ ప్రక్రియల్లో పోటీలు పెడుతూ, సాహిత్య సేవలో నిష్ణాతులైన సాహితీవేత్తలు పురస్కారాలిస్తూ, పేద రచయితల పుస్తకాలను ఉ చితంగా ప్రింట్ చేయిస్తూ ఎనలేని సేవలందిస్తున్నందుకు మనం గర్వపడాలన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.పద్మజ మాట్లాడుతూ- సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ తో మా కళాశాల అనుబంధం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూటూరి విజయలక్ష్మి జాతీయ విశిష్ట ప్రతిభా సాహిత్య పురస్కారాన్ని సాహితీవేత్త దండె స్వర్ణవాహినికి అందజేశారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ సూరేపల్లి రవికుమార్, రచయిత్రి స్నిగ్ధమాధవి, లెక్చరర్స్, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా చిలుకు ద్వాదశి వేడుకలు...



**పెనుగంచిప్రోలు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని జమ్మి చెట్టు కోదండ రామాలయం దేవాలయంలో ఆదివారం చిలుకు ద్వాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ముందుగా దేవాలయం అర్చకులు పరంకుశం బాలకృష్ణమాచార్యలు ఆధ్వర్యంలో తులసి, ఉసిరి చెట్లకు కళ్యాణ నిర్వహించారు,ఈ కళ్యాణాన్ని చుంచుబెనర్జీదంపతులు,గూడూరు శ్రీనివాసరావు దంపతులు, కాకాని బెనర్జీ బాబు దంపతుల చేతుల మీదుగా ఈ కళ్యాణాన్ని నిర్వహించారు,అనంతరం దేవాలయం ప్రాంగణంలో చిలుకు తొక్కారు, ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పాల్గొని మంగళ నీరాజనాలు అందజేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# బాధ్యతలు చేపట్టిన చెన్నూరు సొసైటీ పాలకవర్గం



**పెడన,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెడల మండలం చెన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఏసిఎస్ నూతన పాలకవర్గం సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించింది. ఈ సొసైటీ జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. అధ్యక్షుడిగా యర్రంశెట్టి దేవేంద్ర ప్రసాద్ తోపాటు సభ్యులుగా నిమ్మగడ్డ వెంకటేశ్వరావు దొండపాటి శివనాగరాజు నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు సంఘ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం జరిగింది. సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుడిసేవ బ్రహ్మయ్య వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలకవర్గాన్ని అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ కూటమి నాయకులు పంచకర్ల సురేష్ వికృతి శ్రీను బత్తిన హరిరామ్ నల్లమోతు రఘురామ్ పూసా వెంకయ్య గంధం గోపాలకృష్ణ మోటేపల్లి సురేష్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు గ్రామంలో ?2,57,178 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన పలువురు ఇటీవల తీవ్రమైన అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. అనంతరం ఆ చికిత్స ఖర్చులకు సంబంధించి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తులు చేసుకున్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం, మొత్తం ?2,57,178 (రెండు లక్షల యాభై ఏడు వేల నూరా డెబ్బై ఎనిమిది రూపాయలు) ఆరుగురికి మంజూరు చేసింది. ఈ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అనిగండ్లపాడు గ్రామంలోని బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనీ,అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయకారిగా మారిందన్నారు. ప్రజల కష్టసుఖాల్లో నేను ఎల్లప్పుడూ మీతోనే ఉంటాననీ,మీ సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తా అని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ మాజీ చైర్మన్ ఆత్తులూరి అచ్యుతరావు,తోటేం పూడి మురళి సురేష్, అనిగండ్లపాడు గ్రామ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ నేత మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అక్రమం

-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు



**పెనుగంచిప్రోలు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి బీసీ నేత జోగి రమేష్ ను కూటమి సర్కార్ కక్షపూరితంగా వ్యవహరించి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు లోని స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో సుమారు 9 మంది మృతిచెందారని దానిని కప్పిపుచ్చుకోవడం కోసం బీసీ నేత ఈ రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయటం అత్యంత బాధాకరమని అన్నారు, జోగి రమేష్ వారి కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో ఏ తప్పు చేయలేదని ఆయన ప్రమాణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల హామీ బీసీలకు రక్షణ చట్టం ఏమైందని ప్రశ్నించారు..? కూటమి ప్రభుత్వం బీసీలపై కపట ప్రేమ చూపిస్తుందని, సంబంధం లేని నకిలీ మద్యం కేసులో కీలక సూత్రదారులను వదిలిపెట్టి మా బీసీ నేత జోగి రమేష్ నీ అన్యాయంగా అరెస్ట్ చేయటం పట్ల బీసీలపై కూటమి కుట్ర బట్టబయలైందనీ తెలిపారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని దానిని ఏకంగా బీసీలపై అమలు చేస్తున్నారని అన్నారు. బీసీ నేత మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమ అరెస్టును ప్రజలందరూ గమనిస్తున్నారని తగిన సమయంలో బీసీలు అంత ఏకమై కూటమి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెబుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు చేని రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, గ్రామ యూత్ కన్వీనర్ మల్లెబోయిన సైదులు, పార్టీ బీసీ నాయకులు ఇటూరి వెంకట్, ఏసు ఉసేన్, మండల ఉపాధ్యక్షులు తమ్మిశెట్టి సోమయ్య మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నల్లబోతుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

# అర్జీదారులను క్షుణ్ణంగా తనిఖీ చేయని పోలీసులు..



**మచిలీపట్నం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కు అనేకమంది బాధితులు మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయం కు వస్తూ ఉంటారు. ఈ తరుణంలో పోలీసులు బాధితులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారుల వద్దకు పంపించాల్సి ఉంది. అయితే పోలీసులు తనిఖీలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనికి ఉదాహరణ మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఓ వృద్ధుడు గతంలో తనకు న్యాయం జరగలేదంటూ కలెక్టర్ కార్యాలయంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ఇది మరువక ముందే సోమవారం మీకోసం కొచ్చిన ఒక మహిళ ఒంటి పై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారుల ఎదుటే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనికి కారణం అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సెక్యూరిటీ సిబ్బంది అర్జీ దారులను క్షుణ్ణంగా తనిఖీ చేయకపోవడమే! అర్జీదారులను తనిఖీ చేసే యంత్రాలను పూర్తిస్థాయిలో ఉపయోగించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం మీకోసం వద్ద మెటల్ డిటెక్టర్ ఏర్పాట్లు ఉన్నాయి. అయితే పోలీస్ అధికారులు దీనిని పూర్తిస్థాయిలో వినియోగించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సోమవారం జరిగిన ఘటన ఇందుకు ఉదాహరణ. అర్జీ ఇవ్వడానికి వెళ్ళిన మహిళ లోపలికి వెళ్లే సమయంలో ఆమె దగ్గర ఉన్న బ్యాగును కూడా కనీసం తనిఖీ చేయకపోవడం వల్ల ఆ మహిళ మీకోసం సమావేశంలోకి వెళ్లి అధికారులు అందరి ఎదుట పెట్రోలు ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి ఉంటే ఆ ఘటన జరిగి ఉండేది కాదు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్య పరిష్కార వేదిక మీకోసం కు వచ్చే అర్జీ దారాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారుల వద్దకు పంపించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యంగా దేవాలయాల తనిఖీలు



**విస్సన్నపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కార్తీక మాసం ను పురస్కరించుకొని భక్తుల రద్దీగా ఉన్న దేవాలయాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రమాదాలు నివారించే లక్ష్యంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు నిర్వహించే లక్ష్యంగా అధికార యంత్రాంగం ప్రత్యక్ష పరిశీలన చేయడం జరిగింది. ఎంపీడీవో చిన్న రాట్నాలు, రెవెన్యూ,పోలీస్, ఫైర్,విద్యుత్ తదితర శాఖల అధికారులు విస్సన్నపేట శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయం, కొండ పర్వ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి (మల్లయ్య స్వామి గట్టు ) ఆలయం, పుట్రెల శ్రీ మారెమ్మ తల్లి ఆలయంలలో చెక్ లిస్ట్ ప్రకారం ఏ శతాబ్దంలో నిర్మించారు, కట్టడాలు ఎలా ఉన్నాయి, కనీస అవసరాల పరిస్థితి ఏమిటి, ఆలయానికి ఎన్ని ద్వారాలు ఉన్నాయి, మౌలిక వసతులు ఉన్నాయా లేవా తదితరాలను ఫిల్ చేసినట్లు వారు తెలిపారు.

# జిల్లా అధికారుల ఎదుట మహిళ పెట్రోల్ తో ఆత్మహత్యాయత్నం..

## మీకోసం లో తూతూ మంత్రంగా పోలీసుల తనిఖీలు..

**మచిలీపట్నం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "మీకోసం" మందిరంలో జిల్లా కలెక్టర్ ,జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరిస్తూ తమ పనులలో బిజీగా ఉన్నారు. ఒక మైనర్ యువతి పెద్ద పెద్ద కేకలు వేసింది. ఆ యువతి కేకలను అక్కడ ఉన్న అందరి దృష్టిని ఆకర్షించింది. యువతితో పాటు వచ్చిన మహిళ తన తల్లి. మహిళ హఠాత్తుగా తన వద్ద ఉన్న పెట్రోల్ డబ్బా మూత తీసి పెట్రోల్ ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. దీంతో మీకోసం మందిరంలో ఉన్న అధికారులందరూ ఆశ్చర్యులై చూస్తూ ఉండిపోయారు. అక్కడే ఉన్న ఒక పోలీస్ ఆఫీసర్ ఆ మహిళ వద్దనున్న పెట్రోల్ డబ్బాను లాక్కొని ప్రమాదాన్ని ఆపాడు. దీనితో మీకోసం లో ఉన్న అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. బాధితురాలు తెలిపిన కథనం ప్రకారం తోట కృష్ణవేణి అనే మహిళ యనమలకుదురు డొంకరోడ్ లో నివాసం ఉంటుంది. ఆమెకు కొడుకు, కూతురు ఇద్దరు సంతానం. తన భర్త ప్రోక్లైన్ డ్రైవర్ గా విజయవాడలోని నూతక్కి రాజేంద్రప్రసాద్ వద్ద పనిచేస్తూ కొంత మొత్తంలో డబ్బులను కూడగట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండి ఆనందంగా గడుపుతున్న సమయంలో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. ఆ విభేదాలు చిలికి చిలికి గాలి వానలా మారాయి. దీనితో భార్యాభర్తల మధ్య దూరం పెరిగింది. ఇటీవల తన భర్త తోట శివకుమార్ హఠాత్తుగా మరణించడంతో ఒక్కసారిగా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కడుదయానందనీయంగా మారింది. దీనంతటికీ కారణం భర్త కుటుంబ సభ్యులు అని బాధితురాలు



వాపోయింది. శివకుమార్ కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యకు దూరంగా ఉన్నాడు. ఇటీవల కాలంలో పనిపై హైదరాబాద్ వెళ్లి హఠాత్తుగా అక్కడ మరణించాడు. తాను పనిచేస్తూ సంపాదించిన డబ్బులు, ఇన్సూరెన్స్, బాండ్ పేపర్లు ,బ్యాంక్ బ్యాలెన్స్ అన్ని తన (అన్నా, తమ్ముడు అక్క ,చెల్లి) కుటుంబ సభ్యుల వద్ద ఉండిపోయాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో దూరంగా ఉంటున్న భార్యాభర్తలను గమనించిన శివకుమార్ కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్, డబ్బులు, ఆర్థిక లావాదేవీల కాగితాలను దాచిపెట్టి దానిపై వస్తున్న ఫలాలను అనుభవిస్తున్నారు అని మహిళ ఆరోపించింది. తోట కృష్ణవేణి భర్త ఆస్తి హక్కుదారులు అయినా తన కూతురు ,కొడుకు చెందాలని ఉద్దేశంతో తమకు న్యాయం చెయ్యాలని పెద్ద మనుషులలో పంచాయితీ పెట్టింది. పెద్దమనుషులు న్యాయం చేయకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఆర్థికంగా బలంగా ఉన్న కాంట్రాక్టర్ నూతక్కి రాజేంద్రప్రసాద్ , కృష్ణవేణి భర్త కుటుంబ సభ్యులతో చేతులు కలిపి ఆర్థిక లావాదేవీలు ఆమెకు సంక్రమించకుండా వేధించడంతో మనస్థాపం చెందింది. ఈ విషయంపై కృష్ణవేణి కలెక్టర్ కు ఫిర్యాదు చేయాలని ఆలోచించింది అక్కడ కూడా న్యాయం జరగకపోతే ఆత్మహత్యకు పాల్పడాలని అనుకుంది. ఆమె అనుకున్న విధంగానే తన భర్త కుటుంబ సభ్యుల పై మహిళ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడానికి మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసం కు వచ్చింది. మీకోసం సమావేశ మందిరంలో ఫిర్యాదు ను అధికారులకు ఇచ్చి న్యాయం చేయమని కోరింది. అక్కడ ఉన్న అధికారి ఒకరు ఆమె ఫిర్యాదును చదివి అది న్యాయపరమైన అంశం అని దీనికి కోర్టును ఆశ్రయించాలని తెలపడంతో మనస్థాపం చెంది ఆమెతో పాటు ఉద్దేశపూర్వకంగా తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ (వాటర్ బాటిల్ లో పెట్రోల్ తెచ్చుకుంది) లోని పెట్రోలును ఒంటిపై పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయిందని, తన చావుతోనైనా తమ పిల్లలకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిందని బాధితురాలు మీడియా ముఖంగా తెలిపింది. దీనిపై స్పందించిన కలెక్టర్ డీకే బాలాజీ మహిళ తో పాటు వచ్చిన కుమార్తె ను పిలిచి అర్జీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనర్ యువతి చెప్పిన వివరాలన్నిటిని కలెక్టర్ సావధానంగా విన్నారు. కుటుంబానికి న్యాయం చెయ్యాలనే ఉద్దేశంతో కలెక్టర్ మహిళా ఫిర్యాదు పై విచారణ చేపట్టి వాస్తవ పరిస్థితులను తెలుసుకొని ఆ మహిళకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

# సీ ఎం ఆర్ ఎఫ్ తో పేదలకు భద్రత

### -చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనాచౌదరి



**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ కేంద్ర మంత్రి వర్యులు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. పేద ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం అందజేశారు.పశ్చిమ లోని 36 మంది లబ్ధిదారులకు రూ 26 లక్షల 86 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.. ప్రభుత్వ సహకారంతోపాటు సుజనా ఫౌండేషన్ ద్వారా పశ్చిమ లో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత.విద్య ద్వారానే ఉపాధి ఉద్యోగ అవకాశాలను సృష్టించవచ్చని 60 నెలల తన పాలనలో చేయగలిగినంత అభివృద్ధిని చేసి చూస్తామన్నారు.మేధా దానం, ధన దానం , శ్రమదానం చేసే వారిని ప్రోత్సహిస్తామని అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.రాజకీయాలకతీతంగా సీ ఏం ఆర్ ఎఫ్ చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు.పశ్చిమ ప్రజలకు ఏ అవసరమొచ్చిన ఎన్డీఏ కార్యాలయం సిద్ధంగా ఉందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కోగంటి రామారావు, కార్పొరేటర్లు ఉమ్మడి వెంకటేశ్వరరావు ( చంటి) మైలవరపు మాధురి లావణ్య,ఎన్డీఏ కూటమి నేతలు యేదుపాటి రామయ్య , పత్తి నాగేశ్వరరావు, పగడాల కృష్ణ, తిరుపతి అనూష, తిరుపతి సురేష్, మైలవరపు కృష్ణ, నున్న కృష్ణ, పోతిన భేసు కంటేశ్వరుడు, ఆకారపు విజయ కుమారి,బెవర శ్రీనివాస్, పీవీ చిన సుబ్బయ్య, పైలా సురేష్, రెడ్డి పల్లి రాజు,పోతినీడి లోకేష్, మంగళపురి మహేష్ , దేవిన హరిప్రసాద్ , పల్లంటి ఆది, రేగళ్ల లక్ష్మణ్, జ్ఞాన బాలన్, ఏలూరి సాయి శరత్ తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు





**నూజివీడు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నవంబర్ 14 న బాలల దినోత్సవం పురస్కరించుకొని నూజివీడు పట్టణం శ్రీ వైష్ణవి ఎడ్యుకేషన్ స్కూల్ నందు నర్సరీ నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించి. ఈ వారం రోజులు ఆటల పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు నవంబర్ 14 నా బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ కెత్తే నాని మాట్లాడుతూ... చదువులతో పాటు తమ స్కూల్ నందు ఆట, పాటలు, కూడా బాల్యం నుండి విద్యార్థులు అలవాటు చేసుకోవాలని జీవితంలో ఎదుగుదలకు బాల్యం నుండే ప్రోత్సాహం ఉండాలని తమ స్కూల్ నందు చదువుతోపాటు క్రమశిక్షణ, ఆట, పాటలు, అన్ని రంగాల్లో ఎదుగుదలకు ఉపయోగపడుతుందని ఆ విధంగా విద్యార్థులను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను బాధిత రైతులను ఆదుకుంటాం

### -రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి



**తోట్లవల్లూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** మొంథా తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పేర్కొన్నారు. తుఫాను కారణంగా కురిసిన భారీవర్షాలతో మండల కేంద్రమైన తోట్లవల్లూరులోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఈ క్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచనలతో గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి తోట్లవల్లూరు గ్రామ పరిధిలో ఉన్న వెస్ట్సైడ్ కాల్వ ప్రక్షాళనకు శ్రీకారంచుట్టారు. కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తదితర చెత్తాచెదారాన్ని పొక్లెయిన్ ద్వారా తొలగింపునకు చర్యలు చేట్టారు. పనులకు అయ్యే ఖర్చును పి4 పథకం ద్వారా సేకరించి కాల్వలో పూడికతీత పనులను ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ కాల్వలు, డ్రెయిన్ల దుస్థితికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లపాటు కాల్వలు, డ్రెయిన్లపై దృష్టిసారించలేదని, దీంతో కాల్వలు, డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూడు తదితర చెత్తాచెదారంతో మేటవేసి నీటిపారుదలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యపోకడతో రైతులు నిండామునిగిపోతున్నారన్నారు. డ్రెయిన్లు, కాల్వలు నిర్వహణకు నోచుకోకపోవటంతో ముఖ్యంగా వరి,వాణిజ్య పంటలు సాగుచేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధిపై దృష్టిసారించిందన్నారు. మొంథా వంటి ప్రకృతి వైపరిత్యాలను ధీటుగా ఎదుర్కొంటున్నామని, తుఫాను కారణంగా కురిసిన వర్షాలతో పంట నీటమునిగి అన్నదాత పంట నష్టపోయాడన్నారు. దేశానికే అన్నంపెట్టే రైతన్నకు వచ్చిన కష్టం ఎంతో బాధాకరమని, ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా పరిహారం అందజేస్తామన్నారు. తోట్లవల్లూరు గ్రామంతోపాటు మండలంలో జరిగిన పంట నష్టాన్ని త్వరితగతిన అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొరిపర్తి గోపయ్య, వల్లూరు రాంబాబు, వీరంకి కృష్ణా , ఇర్ఫాన్, కఠారి శంకర్ , కొల్లా సాంబశివరావు, తోట సాయి , తోట రామకృష్ణ , మహమ్మద్ దౌలా , వల్లూరు అశోక్, శ్రీను, బొడ్డు నితీష్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో జనసేనలో చేరిక



**కాకినాడ రూరల్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి,జనసేన పార్టీ అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తీసుకునే ఆలోచనలకు ఆకర్షితులై కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామం లోని రేపాక గార్డెన్స్ కి చెందిన వైఎస్సార్ సీపీ పెద్దలు సుమారు 30 మంది రేపాక గార్డెన్స్ అధ్యక్షులు సిహెచ్ ఎస్ వి.రమణమూర్తి ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామ జనసేన పార్టీ సీనియర్ నాయకులు మాదారపు తాతాజీ అధ్యక్షతన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.వీరికి జన సేన పార్టీ కండువాలు వేసి పార్టీ లోకి సాధారంగా ఆహ్వానం పలికారు.చేరిన వారిలో రేపాక గార్డెన్స్ అధ్యక్షులు సిహెచ్ఎస్ వీ రమణ మూర్తి, పాలిక ఏడుకొండలు, నిమ్మల గంగాధర్, జయప్రకాష్ , శ్రీనివాస్, శాస్త్రీ, కోటిపల్లి రాజశేఖరం,కొండపల్లి సూర్యనారాయణ, తుమ్మల సత్యానందం, తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పెద్దలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# టీచర్లు 'మానసిక ఆరోగ్య చాంపియన్లు' కావాలి

### ప్రముఖ సైకాలజిస్ట్ ప్రొ.టి.డి. విమల





**విజయవాడ పశ్చిమ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఉపాధ్యాయులు కేవలం బోధకులుగా మిగిలిపోకుండా, విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే చాంపియన్లుగా మారాల్సిన అవసరం ఉందని ప్రముఖ మనోవిజ్ఞానవేత్త, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి.డి. విమల అన్నారు. ఎస్.ఆర్.ఎస్.వి బీఈడీ కాలేజీ ఆధ్వర్యాన సోమవారం 'ఎంపవరింగ్ టీచర్స్ యాజ్ మెంటల్ హెల్త్ చాంపియన్స్ ఫర్ స్టూడెంట్స్' అనే అంశంపై ప్రసంగ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విమల మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు చదువు పై ఒత్తిడి, పరీక్షల భయం, ఇతరులతో పోలికలు, కుటుంబ సమస్యలు, సోషల్ మీడియాలో ఒత్తిడి, ఒంటరితనం, ఆత్మవిశ్వాస లోపం, నిరాశ వంటి అనేక మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు విద్యార్థికి మానసిక మద్దతు అందించే మొదటి వ్యక్తిగా నిలవాలన్నారు. విద్యార్థులలో భావోద్వేగ సాహిత్యాన్ని అభివృద్ధి చేయడం, ప్రశంసా సంస్కృతిని ప్రోత్సహించడం, కౌన్సెలింగ్ పద్ధతులను నేర్చుకోవడం ఉపాధ్యాయుని బాధ్యతల్లో భాగం కావాలన్నారు. ఉపాధ్యాయుడి చిరునవ్వు, మంచి మాట, ప్రోత్సాహం విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చగలదన్నారు. ఉపాధ్యాయులు మానసిక ఆరోగ్య ఛాంపియన్లుగా మారి, సుస్థిరమైన, సానుకూలమైన, ఆత్మవిశ్వాసం గల తరాన్ని సృష్టించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకెళ్ళ సూర్య కనకదుర్గ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల మనస్సును అర్థం చేసుకునే మిత్రుడిగా, తరగతి గదిలో భద్రతాపూర్వకమైన వాతావరణాన్ని సృష్టించాలన్నారు. ఉపాధ్యాయులు తమ స్వంత భావోద్వేగ స్థితిని అర్థం చేసుకోవడం కూడా బోధనలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ మాజేటి సతీష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో 'వెల్ బీయింగ్ కరికులమ్' ను ప్రభుత్వం ప్రవేశపెట్టాలన్నారు. బి.ఇడి విద్యార్థులు రాసిన పరిశోధన పత్రాల సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు మహంకాళి మోహనరావు, చిట్టూరి హై స్కూల్ సెక్రటరీ డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

# దేశ గౌరవాన్ని నిలబెట్టిన మన భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు

### -గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



**గన్నవరం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఐసీసీ మహిళల వరల్డ్ కప్ 2025లో భారత మహిళా క్రికెట్ జట్టు సాధించిన చారిత్రక విజయా నికి హృదయపూర్వక అభినందనలు అని గన్నవరం జెడ్పీటీసీ అన్నవ రపు ఎలిజబెత్ రాణి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో విజయం సాధించి, అత్యంత ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు అచంచలమైన ధైర్యం, పట్టుదల, సంకల్పబలం ప్రదర్శించిందని ఆమే ప్రశంసించారు. టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత నాయకత్వాన్ని, మొత్తం జట్టు చూపిన సమిష్టి కృషి, అత్యుత్తమ ప్రదర్శనను దశాబ్దాల కల సాకారమైందని, ఈ చారిత్రక విజయానికి దేశమంతా గర్విస్తోందని అన్నారు. క్రీడాకారిణులు ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తి, పోరాటస్ఫూర్తి దేశంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు.

# ఆదురుపల్లిలో ప్రజా వైద్యం ప్రజల హక్కు కార్యక్రమం

### ●మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మంచిది కాదు... జెడ్పిటిసి పీర్ల పార్థసారథి



**చేజర్ల,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలో ప్రజా వైద్యం ప్రజల హక్కు కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని చేజర్ల జడ్పిటిసి పీర్ల పార్థసారథి సోమవారం ఆదూరుపల్లి గ్రామంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆత్మకూరు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాలతో చేజర్ల మండలం ఆదురుపల్లిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు ప్రజా అభిప్రాయాన్ని స్వీకరిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.ప్రజలు పూర్తిగా మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు ఈ కోటి సంతకాల ప్రజాభిప్రాయం సేకరణలో స్పష్టంగా తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రజా వైద్యం ప్రజల హక్కు అంటూ నినాదాలు పలికారు.ఈ కార్యక్రమంలో యువతీ యువకులు గ్రామస్తులు పాల్గొని పై ప్రజా వైద్యం ప్రజలకు కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# మార్కెట్ యార్డ్ ఆదాయాన్ని పెంచటమే ధ్యేయం

### -స్పష్టం చేసిన చైర్ పర్సన్ అనంతలక్ష్మి



**పెడన,నవంబర్ 3 (వార్తాప్రభ) :**పెడన మార్కెట్ యార్డు ఆదాయాన్ని పెంచడమే పాలకవర్గం లక్ష్యమనిమార్కెట్ యార్డ్ చైర్మన్ భీముని అనంత లక్ష్మీ చెప్పారు. ఎ ఎం సి కార్యదర్శి మురళీ కృష్ణ తో కలసి ఆమె సోమవారం యార్డ్ పరిధిలోని పలు చెక్ పోస్ట్ పాయింట్లను సందర్శించారు. ఈ నేపధ్యంలోవడ్లమన్నాడు వద్ద సెస్ చెల్లించకుండా వెళ్లిపోతున్న ధాన్యం లారీ ని గుర్తించారు. వాహన డ్రైవర్ని ప్రశ్నించగా అతను సరైన సమాధానం చెప్పలేదని లారీని వదిలి వెళ్ళిపోయాడని చైర్మన్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. అనంతరం ఆ లారీని పెడన పట్టణం లోని మార్కెట్యార్డ్ కు తరలించారు. ఈ సంఘటనపై వారు మాట్లాడుతూ యార్డుకు వచ్చే ఆదాయానికి గండికొట్టే చర్యలను అడ్డుకుంటామని అన్నారు ఈ వ్యవహారం పై కూడా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా ఈ లారీ బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామానికి చెందినదిగా తెలిసింది.

# అర్హులకు పించన్ల మంజూరు చేయాలని సిపిఎం డిమాండ్




**విస్సన్నపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పింఛన్ కొరకు అర్హత ఉన్న వారికి పింఛన్ వెంటనే ఇవ్వాలని సిపిఎం మండల పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రదర్శన జరిపారు. అర్హత కలిగి ఉన్న వికలాంగ వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళ చేనేత గీత డప్పు కళాకారులకు హెచ్ఐవి బాధితులకు తలసేమియా వ్యాధిగ్రస్తులకు పక్షవాత పీడితులకు పింఛన్ కొరకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలలో పేజీ ఓపెన్ కావడం లేదని అధికారులు చెప్పుతున్నారని చెప్పులు అరిగేలా తిరిగే పరిస్థితి లబ్ధిదారులకున్నదని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు జ్ఞానరత్నం ఏడుకొండలు రంగారాణి రామకృష్ణ కిషోర్ బి శివ సత్యనారాయణ ఎల్ శ్రీనివాసరావులతో పాటు పెన్షన్ కు అర్హత ఉన్న వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళలు పక్షవాత పీడితులు గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చాటిన తోట్లవల్లూరు విద్యార్థులు



**తోట్లవల్లూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పామర్రు నియోజకవర్గ స్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో తోట్లవల్లూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. పామర్రు మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీలలో ఐదు మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తోట్ల వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన పాముల హిమబిందు మొదటి స్థానం,వీరంకి వెంకట బాలాజీ బాజీరావు రెండవ స్థానం కైవసం చేసుకున్నారు. విజేతలైన విద్యార్థులను, గైడ్ శ్రీ రంగనాయకుడిని తోట్లవల్లూరు ఎంఇఓలు వెంకటేశ్వరరావు ,సురేష్ అభినందించారు.అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణి రాజమోహన్, ఉపాధ్యాయులు,ఇతర సిబ్బంది అభినందించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నవంబర్ 26 వ తేదీన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ప్రభుత్వం కల్పించనుంది.



మార్కాపురం బాలికల పాఠశాలకు చెందిన జ్యోతి అనే విద్యార్థిని సోమవారం ఒంగోలులో జరిగిన సెలెక్షన్స్ లో స్టేట్ యోగా సెలెక్ట్ అండర్ 14 ఇయర్స్ కు సెలెక్ట్ అయింది. ఈ సందర్భంగా చి. జ్యోతిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

**-మార్కాపురం, నవంబర్ 3 (వార్తాప్రభ) :**

## తుపానుకు 1,502హెక్టారుల్లో వరికి దెబ్బ...



**గుడ్లవల్లేరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** మొంథా తుఫాను ప్రభావంతో గుడ్లవల్లేరు మండలంలో 1,502హెక్టారుల్లో వరి పంట దెబ్బ దెబ్బ తిన్నట్లు ఏఓ ఎల్.సునీల్ తెలిపారు. శుక్రవారం ఆయన కౌతవరంలో పంట నష్ట పరిహారాన్ని నమోదు చేశారు. వరి వంటను ప్రభుత్వం ఆదేశాలు మేరకు పంట నష్ట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి ఆయన దెబ్బ తిన్న పొలాల్ని పరిశీలించారు. మండలంలో 9వేల హెక్టార్ల వరి సాగవుతుందన్నారు. అందులో 1,502హెక్టారుల్లో వరి పంట దెబ్బతిన్నట్లు చెప్పారు. ప్రాథమిక వంట నష్టం అంచనా జరిగిందన్నారు. గురువారమే అన్ని గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు వంట నష్టాన్ని యాప్ ద్వారా నమోదు చేయడం జరిగిందన్నారు. రైతులు తమ పొలాల్లో నీటిని త్వరగా తీసివేయడం ద్వారా కొంతమేరకు నష్టాన్ని తగ్గించవచ్చునన్నారు. ధాన్యం రంగు మారకుండా కాపాడుకోవచ్చునని రైతులకు సునీల్ సూచించారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా తమకు జరిగిన పంట నష్టాన్ని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా తెలియజేస్తే నష్టాన్ని పరిశీలించి నమోదు చేస్తామని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ రెండు రోజులు ఫీల్డ్‌లో ఉండవలసిందిగా తెలియజేశారు. రైతులు కూడా వ్యవసాయ శాఖ అధికారులకు సహకరించవలసిందిగా కోరారు.

## సర్వ స్వాములకు సద్ది...



**గుడ్లవల్లేరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు శ్రీ గంగానమ్మ దేవ స్థానంలో జరిగిన దేవస్థాన ప్రతిష్టలో భాగంగా అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ మాలధారులకు స్థానిక వేణుగోపాల స్వామివారి ఆల యంలో సోమవారం సద్ది(భోజనం) నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, మురాల నరేష్ తదితరులు ఉన్నారు.

## భక్తి ప్రపత్తులతో కార్తీక పూజలు...



**గుడ్లవల్లేరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండలంలోని శివాలయాలు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో పూజల్ని నిర్వహించాయి. వేకువజాము నుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకు నేందుకు శివాలయాల్లో బారులు తీరారు. గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, నగరేశ్వరాలయం, విన్నకోట భోగేశ్వరాలయం, కౌతవరం గౌతమేశ్వరాలయాల్లో స్వామివార్లకు వేద మంత్రోచ్చరణ నడుమ అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు నిర్వహించారు. భక్తిప్రపత్తులతో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు.

## స్పాస్ పెన్షన్ అందజేత...



**పెనుగంచిప్రోలు, నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం భాగంలో ఇటీవల ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన స్పాస్ పెన్షన్ విధానాన్ని తమ్మిశెట్టి మన్నెమ్మ కు పెన్షన్ సోమ వారం ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో సచివాలయం 3 కార్యదర్శి లెనిన్ మైనార్టీ నాయకులు మహమ్మద్ ఆజాద్ పాల్గొన్నారు..

## కైకలూరు,కలిదండి వెటర్నరీ సిబ్బందిని సన్మానించిన ఎమ్మెల్యే కామినేని




**కైకలూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాసరావు కైకలూరు మరియు కలిదిండి మండలాల్లో సమర్థవంతంగా సేవలందించిన కైకలూరు ఏవీహెచ్ ఏ వి హెచ్ వెటర్నరీ సిబ్బందిని, కైకలూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ముస్తఫాఖాన్ ను సన్మానించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో కైకలూరు, కలిదిండి మండలాల్లో ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు, రైతులకు, పశుపోషకులకు, పశువులకు సహాయ సేవలు అందించడంలో, పశువులకు వరదలు వల్ల ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా, ఏవీహెచ్ బృందం చూపిన నిబద్ధత, టీమ్‌వర్క్‌కు డా. కామినేని శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసిన ఈ బృందం ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ప్రభుత్వం, ప్రజలు ఒకటిగా ముందుకు సాగితే ఏ విపత్తునైనా అధిగమించగలము" అని పేర్కొన్నారు.సన్మాన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఏవీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జోగి రమేష్ ను అరెస్ట్ చేయడం దుర్మార్గం

**• తీవ్రంగా ఖండించిన జి.కొండూరు మండలం వైసీపీ నేతలు • లిక్కర్ స్కాం ను బయటపెట్టినందుకే జోగి రమేష్ ను అరెస్టు చేశారు :సుకుంద్ • వైసీపీ తిరిగి 2029 లో అధికారంలోకి వస్తుంది కల్తీ మద్యం కేసును రీ ఓపెన్ చేస్తాం-జడ రాంబాబు • ప్రజా పాలనను గాలికి వదిలేసి అక్రమ కేసులపైనే దృష్టి పెట్టిన ప్రభుత్వం-మాధవి • కల్తీ మద్యం కేసును సిబిఐ తో దర్యాప్తు చేయించాలి-ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ**





**జి.కొండూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** కల్తీ మద్యం వ్యవహారాన్ని బయట పెట్టిన జోగి రమేష్ ను అదే కల్తీ మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని జి కొండూరు మండల వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయ–స్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ వేములకొండ సాంబశివరావు నివాస గృహంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విలేక రుల సమావేశం నిర్వహించా రు.ఈ సందర్భంగా వారు జోగి రమేష్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు.కాశీబుగ్గలో జరిగిన తొక్కి సలాట నుంచి రాష్ట్ర ప్రజల దృష్టి మళ్ళించడం కోసమే మాజీ మంత్రి జోగి రమేష్ ను టిడిపి కూటమి సర్కార్ అక్రమంగా అరెస్టు చేయించి ందని దుయ్యబట్టారు.నకిలీ మద్యం కుంభకోణంపై కోర్టులో కేసు నడు స్తుండగా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు.నకిలీ మద్యం కేసును సిబిఐ కి అప్పగించాలని వైసీపీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**క్కర్ స్కాం ను బయటపెట్టినందుకే తప్పు చేసేది వాళ్ళు దోచుకునేది వాళ్ళు దాచుకునేది వాళ్ళు పంచుకునేది వాళ్ళు జోగి రమేష్ ను అరెస్టు చేశారు :సుకుంద్ ..** రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యవహారాన్ని బయటపెట్టినందుకే కూటమి ప్రభుత్వం జోగి రమేష్ పై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేయించిందని వైసీపీ నాయకుడు వెలగలేరు గ్రామ పార్టీ అధ్యక్షుడు వై.సుకుంద్ అన్నారు.తప్పు చేసేది వాళ్ళు, దోచుకునేది వాళ్ళు, దాచుకునేది వాళ్ళు పంచుకునేది వాళ్ళు వీటన్నింటిని పక్కన పెట్టారని, ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చేసే అన్యాయాలు, అక్రమాలను, టీడీపీ అక్రమాలను బయట పెట్టినందుకు తిరిగి జోగి రమేష్ పైనే కేసు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కోర్టులో జోగి రమేష్ పై నేరారోపణలు రుజువు కానప్పటికీ కావాలని తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం సరికాదన్నారు.రాష్ట్ర ప్రజలు చూస్తూనే ఉన్నారని,అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని రానున్నరోజులలో కూటమి ప్రభు త్వానికి ప్రజలు చరమగీతం పడతారన్నారు. ప్రజలను చైతన్యపరచి కూటమి సర్కార్ కి సమాధి కడతామని హెచ్చరించారు.

**వైసీపీ తిరిగి 2029 లో అధికారంలోకి వస్తుంది కల్తీ మద్యం కేసు రీ ఓపెన్ చేస్తాం-జడ రాంబాబు..** రాష్ట్రంలో ఏది జరిగినా గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపమేనని చెప్పుకోవటం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని, గడచిన 18 నెలలుగా కూటమి ప్రభుత్వం ఏమిచేస్తుందని జడ రాంబాబు ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జోగి రమేష్ పై డైవర్షన్ పాలిటిక్స్ ప్రయోగిస్తుందని అన్నారు. అసలు నకిలీ మద్యం అనేది తంబలపల్లి నియోజక వర్గం మొలకలచెరువులో జై చంద్రారెడ్డి ఉన్నచోట బయటపడింది.దీనిని ఎక్సైజ్ పోలీసులు బయటపెట్టారని అన్నారు. దానిద్వారా ఇబ్రహీంపట్నంలో కూడా నకిలీ మద్యం డంపు చేసినట్లుగా సమాచారం రావడంతో అదే సమయంలో జోగిరమేష్ కృష్ణా నదిలో బూడిద చెరువు నీళ్ళు కలుస్తున్నాయనే దానిపై కార్యక్రమం చేస్తున్న సమయంలో నకిలీ మద్యం విషయం తెలుసుకుని వెంటనే డంపు చేసిన ప్రాంతానికి వెళ్ళడం జరిగిందన్నారు. దానిని బయట పెట్టారన్న కక్షతో జోగి రమేష్ పై అక్రమ కేసులు పెట్టారని రాంబాబు ఆరోపించారు.నాడు రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి బెల్టు షాపులు లేకుండా చేశారని, ఎక్కడ బెల్ట్ షాపు ఉన్నా వారి మీద కేసులు నమోదు చేశారని, నేడు రాష్ట్రంలో ఏ ఊర్లో చూసినా 5,6 బిల్ట్ షాపులు ఉంటున్నా యని,చిల్లర కొట్టుల్లో కూడా మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు.బెల్ట్ షాపుల పాపం ఈ కూటమి ప్రభుత్వానిదే అన్నారు.వైసీపీ తిరిగి 2029 లో అధికారంలోకి వస్తుందని, కల్తీ మద్యం కేసు రీ ఓపెన్ చేస్తామని, ఇదే ఇదే జనార్దన రావు, జయచంద్రారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అతని బామ్మర్ది పేర్లు చెప్పిచ్చి ఇదే రీతిలో శిక్ష పడేలా చూస్తామని జడ రాంబాబు స్పష్టం చేశారు.

**ప్రజా పాలనను గాలికి వదిలేసి అక్రమ కేసులపైనే దృష్టి పెట్టిన ప్రభుత్వం-మాధవి..** కూటమి ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసి అక్రమ కేసులపైనే దృష్టి పెట్టిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విభాగం జి.కొండూరు మండల మహిళా అధ్యక్షురాలు రాజాపు మాధవి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న లోపాలను ఎత్తి చూపినందుకు జోగి రమేష్ ని అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు.అలా ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ పరిపాలన ఎలా ఉందో ప్రజలు చూస్తూనే ఉన్నారని ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు.జోగి రమేష్ పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కల్తీ మద్యం కేసును సిబిఐ తో దర్యాప్తు చేయించాలి-ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ..** కల్తీ మద్యం కేసును ప్రభుత్వం సిట్ కాకుండా సిబిఐ(CBI)తో దర్యాప్తు చేయించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ డిమాండ్ చేశారు.ప్రతిపక్ష నేతగా నకిలీ మద్యం కేసును బయట పెట్టిన జోగి రమేష్ పై అక్రమ కేసులు బనాయించారని, ఇలా ఎంతమంది నోర్లు నొక్కుతారని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే వారిపై బెదిరింపు ధోరణికి పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. జోగి రమేష్ ను రిమాండ్ కు పంపిస్తే మరొకరు నోరు తెరవరనే ఉద్దేశంతోనే ఇదంతా చేస్తుందని అన్నారు.ఈ సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వేములకొండ విష్ణు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వేములకొండ రాంబాబు, వైసీపీ నాయకులు ఉమ్మడి ప్రసాద్, చెన్నూరు సుబ్బారావు, తంగెళ్ళమూడి రవి,శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా మహిళా క్రీడాకారుల సత్తా చాటారు

**• విశ్వవిజేతలకు ఘనంగా శుభాకాంక్షలు • ఎన్నో సంవత్సరాల కల నెరవేరింది రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి**



**నూజివీడు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** గత 47 సంవత్సరాల కళ నెరవేరిన సందర్భంగా నూజివీడు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మరియు ఎమ్, టి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ వసతి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ నాయకులు కార్యకర్తలు.మరియు విద్యార్థులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు మొదటిగా కేక్ కోసి ఒకరినొకరు స్వీట్స్ పంచుకొంటూ సంబరాలు చేసుకున్నారు.అనంతరం మంత్రివర్యులు వర్చువల్లో మాట్లాడుతూ గత 47 సంవత్సరాల కల నెరవేరిన సందర్భంగా ఏవత్ దేశ ప్రజలంతా సంబరాలు చేసుకొంటుందని ఇది మంచి శుభపరిణామమన్నారు. భారత దేశ సత్తా మహిళల సత్తా ప్రపంచానికి తెలియజేసిన మహిళా క్రికెట్ టీమ్ అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేశారు.రాత్రి ఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రిక తో తలబడిన ఇండియా టీమ్ 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడం గొప్ప పరిణామమన్నారు.ఇది ఒక చరిత్ర అని మంత్రి తెలియజేసారు. భారత దేశ మహిళల శక్తి సామర్థ్యాలు పూర్వము నుండి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు.గతంలో వంట ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశ ప్రగతిని పెంచారన్నారు. గతంలో కొన్ని క్రీడలకే పరిమితమైన మహిళలు నేడు క్రికెట్లో ప్రపంచాన్ని జయించి దేశ కీర్తి ప్రతిష్టలు మరింత పెంచారని కొనియాడారు.గతంలో బ్యాట్మెంట్, హాకీ,కబాడీ, టెన్నీస్, క్రీడలకే పరిమితమైన మహిళలు నేడు పురుషులకు దీటుగా క్రికెట్ లో ప్రపంచాన్నే జయించడం దేశం మొత్తం గర్వించదగ్గ విషయం అని అన్నారు. ఇదే స్ఫూర్తితో మరింతగా రాణించాలని అన్నారు.అంతే కాక క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు.నూజివీడు నుండి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి రాష్ట్ర, దేశ జట్లకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. అలాగే, క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ఇది సువర్ణావకాశమని ఉద్ఘాటించారు. పట్టణంలో ఉన్న స్టేడియంలోపనులను త్వరలోనే పూర్తి చేసి క్రీడాకారులందరికీ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నూజివీడు నుండి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయికి పంపడానికి నావంతు సహాయ సహకారాలు అందిస్తామని క్రీడల ప్రోత్సహానికి అవసరమైన వివిధ కిట్లు అందజేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి, సత్యనారాయణ,మాజీ మున్సిపల్ చైర్పరషన్ జాన్సీ రాణి, కృష్ణకుమారి, దుర్గాదేవి,నాగరాజు, ప్రసాదు, గౌరీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను అణగదొక్కుతున్న కూటమి ప్రభుత్వం

**• జోగి రమేష్ కి ఏదైనా జరిగితే ప్రభుత్వం బాధ్యత వహించాలి-వైఎస్ఆర్సిపి నాయకులు**



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 3 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి జోగి రమేష్ లాంటి బీసీ నాయకులను అక్రమ కేసులో ఇరికించి జైలుకు పంపించడం ద్వారా బీసీలను తొక్కే విధంగా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తుందని మండిపడ్డారు క వైఎస్ఆర్సిపి నాయకులు. మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ జోగి రమేష్ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఇబ్రహీంపట్నంలో సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమాజంలో ఉమ్మడి జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి నీ పక్కన పెట్టి కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని, అందులో భాగంగానే మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి నాయకులు జోగి రమేష్ ను అక్రమ కేసు ఇరికించి అరెస్టు చేశారని అన్నారు. వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ నాయకులపై కక్షపూరిత రాజకీయాలు సమంజసం కాదని, జోగి రమేష్ కి ఏదైనా జరిగితే ప్రభుత్వ పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఇది పూర్తిగా కుట్రపూరిత రాజకీయమని, దీని ప్రజలు హర్షిం చరని అన్నారు. కొండపల్లి మున్సి పాలిటీ అభివృద్ధి చేయలేని నాయకులు కూడా జోగి రమేష్ అరెస్టు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# జోగి రమేష్అరెస్టు అక్రమం



**రెడ్డిగూడెం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి జోగి రమేష్ ని కల్తీ మద్యం కేసులో అరెస్టు చేయడం వల్ల ప్రభుత్వ పిరికితనం బయటపడిందని, అన్యాయంగా, అక్రమంగా జోగి రమేష్ ని అరెస్టు చేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రెడ్డిగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు పైడిమర్ల శ్రీనివాస రెడ్డి ఇంటి ఆవరణలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి రాష్ట్రాన్ని మద్యం మత్తులో దింపి, ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి టిడిపి పచ్చ బ్యాచ్ తో కల్తీ మద్యం తయారు చేపిస్తూ వేలాది కోట్లు రూపాయలు సంపాదించే పనిలో లోకేష్ ఉన్నాడనీ, దానికి పోలీసులు, ఎక్సైజ్ శాఖ, సిట్ అధికారులు కొందరు అండదండలు ఉన్నాయని ఆరోపించారు. గుట్టు బయట పడటంతో కల్తీ మద్యం నిందితులు జనార్ధన్ ను బెదిరించి జోగి రమేష్ పేరు చెప్పించడం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. కల్తీమద్యం మూలాలను బయటకు తీసిన వ్యక్తి జోగి రమేష్ అని అందుకే ఆయన పై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు ప్రజలందరూ చూసి అర్థం చేసుకుంటున్నారని, పచ్చమీడియాలో తప్పుడు కథనాలు వల్లిస్తే నమ్మే స్థితిలో ఈ రాష్ట్ర ప్రజలు లేరని అన్నారు. రాబోయే రోజుల్లో తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం వైస్ ఎంపీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శులు చాట్ల రాబర్ట్, కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు, జిల్లా ఐటి వింగ్ జనరల్ సెక్రటరీ గుడిసె ప్రభాకర రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మట్టకొయ్య రాము, యూత్ అధ్యక్షులు గుంటక వంశీ కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రంగాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు బి చెన్నారెడ్డి, రెడ్డిగూడెం ఏడో వార్డు సభ్యులు చాట్ల ఇమ్మానుయేలు, ఎనిమిదో వార్డు సభ్యులు చాట్ల రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు

# కరాటేలో వాడో - ర్యూ విద్యార్థుల విజయం



**ఇబ్రహీంపట్నం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** 24వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ – 2025 పోటీల్లో గుంటుపల్లి వాడో – ర్యూ అకాడమి విద్యార్థులు వివిధ కేటగిరిల్లో విజయం సాధించారు. 170 మంది బాలబాలికలు కటా మరియు కుమితే విభాగాల్లో పాల్గొన్నారు. 52 మంది ప్రథమ స్థానం, 50 మంది ద్వితీయ స్థానం, 68 మంది తృతీయ స్థానాలు సాధించారు. కరాటే అకాడమీ డైరెక్టర్ జె.ఎం.దాస్, సీనియర్ ఇన్ స్ట్రక్టర్లు ఎం.డి.ఆరిఫ్ పాషా, పి.సతీష్ కుమార్, కె.ఎస్.ఎస్.హర్షిత అభినందించారు. గెలుపొందిన విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ దాస్ తెలిపారు.

# ఘనంగా శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం



**ఇబ్రహీంపట్నం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఇబ్రహీంపట్నంలో సోమ వారం నాడు భక్తి శ్రద్ధల మధ్య శ్రీ మహా గణపతి, దత్తాత్రేయ, శ్రీ సాయిబాబా, శ్రీ శీతలాంబ (బొడ్డురాయి) పరివార సమేత శ్రీ గంగానమ్మ తల్లి నూతన ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పునఃప్రతిష్ఠా క్రతువులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నిండా "జై గంగానమ్మ తల్లి" నినాదాలతో భక్తజనం ఉత్సాహంగా పాల్గొన్నారు. తరువాత జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో దేవినేని ఉమామహేశ్వర రావు గారు స్వయంగా భక్తులకు అన్నదానం చేశారు. భక్తులతో సత్సంభాషణ జరుపుతూ, "ఇలాంటి దేవాలయాలు గ్రామ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమైక్యతకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయి" అని అన్నారు. స్థానిక ప్రజలు, భక్తులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఉత్సవం, హారతి కార్యక్రమాలు, సంగీత భజనలు ఈ వేడుకకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అందించాయి.

# మాలకొండా రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

**-కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ సుబ్బయ్య యాదవ్**



**చేజర్ల,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఆత్మకూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశానుసారం చెజర్ల మండలం కోటితీర్థం గ్రామంలో చేజర్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బోయిళ్ల మాల కొండ రెడ్డి గోతం వెంకట సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని వెంటనే కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణను ఆపి తమ లాంటి పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు వైద్య విద్యను అందరికీ అందేలా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వైసిపి పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# ఎం.ఎస్.ఎం.ఈ చైర్మన్ తమ్మిరెడ్డిని కలిసిన అక్బర్



**అనుమసముద్రంపేట,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నెల్లూరుకి విచ్చేసిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ను అనుమసముద్రంపేట జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ బాషా సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే ప్రసిద్ధి పుణ్యక్షేత్రం అయిన హజరత్ సయ్యద్ ఖాజా నాయబ్ రసూల్ దర్గా చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు.అక్బర్ బాషా మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో జరిగిన పరిణామాలన్నీ జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలిస్తున్నారని ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మి రెడ్డి తెలిపారని అన్నారు.జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారని తెలిపారు.

# మన దేశ మహిళల సత్తాను ప్రపంచానికి చాటారు : శాసనసభ్యులు యార్లగడ్డ




**గన్నవరం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలవటం ద్వారా మన దేశ మహిళల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పారని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ భారత మహిళా క్రికెట్ జట్టు ను కొనియాడారు. మహిళల క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంట్లో సత్తా చాటిన మన దేశ మహిళా క్రికెట్ జట్టును యార్లగడ్డ సోమవారం ఓ ప్రకటన లో అభినందించారు. లీగ్ దశలో పరాజయాలు ఎదురైనా కుంగిపోకుండా జట్టులోని క్రీడాకారులు అందరూ సమిష్టిగా కృషి చేసి ఈ ఘనత సాధించారని, వీరి పోరాటపటిమ దేశంలోని యువతకు, మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న దేశంలోని మహిళా శక్తికి ఈ విజయం ప్రతీకగా నిలుస్తుందని, ఈ విజయంతో ప్రపంచ పటంలో మరోసారి మన దేశ మహిళల ఖ్యాతి ఇనుమడించిందన్నారు. ఇదే రీతిలో విజయాలు సాధిస్తూ ప్రపంచంలోనే మేటిజట్టుగా కొనసాగాలని ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆకాంక్షించారు.

# మాజీమంత్రి జోగి అరెస్టు అన్యాయం



**తోట్లవల్లూరు,నవంబర్ 3 (వార్తాప్రభ) :** వైయస్సార్సీపి నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అన్యాయమని వైఎస్ఆర్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతలపూడి గవాస్కరరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ఆయన సోమవారం మాట్లాడుతూ బీసీ నేత, మాజీమంత్రి జోగి రమేష్ విషయంలో ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. జోగికి సంబంధంలేని అక్రమమద్యం కేసును అంటగట్టి అన్యాయంగా అరెస్ట్ చేయటం భావ్యం కాదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి ని ఎండగట్టే వారి పట్ల కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని గవాస్కర్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రతిపక్షాలను వేధించడం మానుకొని ప్రజలకు సుపరిపాలన అందించాలని సూచించారు. అక్రమ మద్యం కేసులో అరెస్టు అయిన జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము కడిగిన ముత్యాల్లా బయటకు వస్తారని, వారికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తో పాటు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# సౌర శక్తిని ఒడిసి పట్టుతాం!!

- పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం అవుతాం
- రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకున్న కుటుంబాలు
- సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న పద్మావతి కాలనీ



**పెద్దపల్లి/ గోదావరిఖని,నవంబర్ 3 (వార్తాప్రభ) :** సౌర శక్తిని ఒడిసి పట్టుతాం అని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం అవుతాం అని కంకణం కట్టుకుని తమ ఇళ్లపై, అపార్ట్మెంట్లపై రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకున్నారు 15 కుటుంబాలు. రామగుండం నగర పాలక సంస్థ పద్మావతి కాలనీ ప్రజలు ప్రధానమంత్రి – సూర్య ఘర్, ముఫ్త్ బిజిలీ యోజన' వంటి పథకాల సహకారంతో సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేసుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ఉన్న కాలనీ ప్రజలు తాము సైతం ఇలాంటి సోలార్ పవర్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు, పద్మావతి కాలనీ ప్రజలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నట్లు కితాబులు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం!!

- రైతు శ్రమకు న్యాయమైన ధర ఇస్తున్న సర్కార్
- అవినీతికి పాల్పడితే ఎమ్మెల్యే సహించరు
- కాంగ్రెస్ మహిళా నేత మనాలి ఠాకూర్



**పెద్దపల్లి/ అంతర్గాం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ మహిళా నేత, రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ పరిధిలోని అంతర్గాం మండలం విస్సంపేట గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మనాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడితే ఎమ్మెల్యే సహించరు అని హెచ్చరించారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు కష్టాలు ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.

# కార్తీక సోమవారం శోభ.. శైవ పోటెత్తిన భక్తులు





**గుడివాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పట్టణంలో కార్తీక సోమవారం శోభ నెలకుంది. పట్టణంలోని శైవ క్షేత్రాలకు తెల్లవారుజామునుండే భక్తులు పోటెత్తారు. ప్రసిద్ధిగాంచిన శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ గౌరీ శంకర స్వామి దేవాలయాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయాల ప్రాంగణాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీప పూజలు నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు విశేష అభిషేక పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నామని దేవాదాయ శాఖ అధికారి కందుల గోపాలరావు తెలిపారు. ఈనెల 5వ తేదీ కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, జ్వాలాతోరణ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

## భక్తులకు పాలు పంపిణి చేసిన జనసేన బూరగడ్డ..

సోమవారం ఉదయం గుడివాడ పట్టణం బేతవోలు లో వేంచేసి వున్న ఆనందేశ్వరస్వామి వారి దేవస్థానం శివాలయంలో గుడివాడ జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్ కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా శివుని దర్శనం చేసుకుని వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ క్రమంలో ఉదయం 4 గంటల నుండి దర్శనం కోసం వచ్చిన భక్తులకు బూరగడ్డ శ్రీకాంత్ పాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కంచనపల్లి సీతారాం, బుడమ వీర్రాజు, శేషం మురళి, తెలుగుదేశం నాయకులు పోలాసి ఉమా, ల్యాబ్ శ్రీను, మొక్కపాటి సూర్యం బిజెపి నాయకులు మరియు దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దోష నివారణ నిమిత్తం పవిత్రత దృష్ట్యా పవిత్రోత్సవ మహోత్సవములు..



**గుడివాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పాటిమీద జగన్నాధపురం లో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు వార్షిక పవిత్రోత్సవ మహోత్సవములు.. ఈనెల 2వ తేది సాయంత్రం ఉత్సవం విశ్వక్సేనారాధనతో ప్రారంభించగా శ్రీరంగం నుండి వచ్చిన పవిత్ర మాలలు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం శివప్రసాద్ (చిట్టిబాబు), దేవస్థానం ఈ.ఓ. కందుల వేణుగోపాలరావు మరియు కమిటీ సభ్యులు చేతుల మీదగా దేవస్థానం చుట్టూ ప్రదక్షణ గావించి శ్రీ స్వామివారికి సమర్పించడం.. తదుపరి రక్షాబంధనం మృత్యుం గ్రహణ హోమం వంటి కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.ఓ వేణుగోపాలరావు మాట్లాడుతూ అత్యంత పవిత్రంగా నిర్వహించబడి పవిత్రోత్సవ కార్యక్రమంలో గుడివాడ పట్టణ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించి కనులారా తిలకించవలసినదిగా కోరారు. ఆలయ అర్చక స్వామి వేదాంతం అప్పలాచార్యులు మాట్లాడుతూ శ్రీ స్వామి వారి దేవస్థానం యందు దోష నివారణ నిమిత్తం పవిత్రత దృష్ట్యా పవిత్రోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నిమ్మగడ్డ కృష్ణారావు, చందు శ్రీనివాస రావు, పి. రాజేశ్వరరావు, వేదాంతం కృష్ణ వేణి, కొడాలి విజయ లక్ష్మి, గూడపాటి సుజాత పంతంగి హేమ జోగి సాంబశివరావు భక్తులు పాల్గొన్నారు.

# అన్న సమారాధన నిమిత్తం భక్తుల విరాళాలు..

## -విరాళా దాతలను ప్రత్యేకంగా అభినందించిన దేవస్థానం ఈ.ఓ. కె.వి. గోపాలరావు..

**గుడివాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** స్థానిక గౌరీ శంకరపురంలో వేంచేసి ఉన్న శ్రీ గౌరీ శంకర్ స్వామి వారి దేవస్థానం నందు ప్రతి నెల ఆఖరి గురువారం శ్రీ సాయిబాబా వారి మందిరం నందు భక్తుల సహాయ సహకారములతో నిర్వహించబడు గొప్ప అన్న సమారాధన కార్యక్రమం గురువారం నిర్వహించబడు సందర్భంగా గుడివాడ పట్టణ వాస్తవ్యులు దాసరి కిషోర్, సూర్య మరియు కుటుంబ సభ్యులు సదరు మహా అన్న సమారాధన నిమిత్తం రూ.20,000/- (ఇరవై వేల రూపాయలు) విరాళముగా సమర్పించి యున్నారు. మరియు అమజాల పూర్ణచంద్రరావు రూ.1100/-(ఒక వెయ్యి వంద) మరియు ఆంజనేయులు రూ.1000/-ఒక వెయ్యి విరాళంగా అందజేసియున్నారు అని ఈ.ఓ. కె.వి. గోపాలరావు ప్రకటనలో తెలిపారు. దానాలలో అన్నదానం గొప్పదని విరాళాధాతలను ప్రత్యేకంగా అభినందించి శ్రీ స్వామి వారి శేష వస్త్రం ప్రసాదములు అందజేసియున్నారు. సదరు అన్నదాన కార్యక్రమం నకు వస్తురూపమైన ధన రూపేనా విరాళం అందజేయు భక్తులు దేవస్థాన కార్యాలయం నందు సంప్రదించి తగిన



రసీదు పొందవలసిందిగా కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన



**కాకినాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కాకినాడ ట్రాఫిక్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డిజిటల్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం సోమవారం కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లోని పిఆర్ ఒకేషనల్ కళాశాలలో జరిగింది. ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకం, ఈవ్ టీసింగ్, సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీడియోల రూపంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ట్రాఫిక్– 1 సిఐ ఎన్ రమేష్ వ్యవస్థ గురించి వివరించారు. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. జీబ్రా లైన్ లేని ప్రదేశాల్లో రోడ్డు దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉపయోగాలను వివరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదనీ, డ్రైవర్ పక్కన లేదా వెనుక భాగంలో కూర్చోరాదని విద్యార్థినులకు సూచించారు. బస్సుల ఫుట్‌పాత్ ప్రయాణం ప్రమాదకరమన్నారు. సీట్ బెల్ట్ లేకుండా, లేదా అధిక వేగంతో వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సడన్ డోర్ ఓపెన్ చేయడం వలన జరిగే ప్రమాదాలను వివరించారు. అదేవిధంగా, విద్యార్థినులకు ఈవ్ టీసింగ్ మరియు మహిళల భద్రత అంశాలపై కూడా సిఐ రమేష్ విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల గురించి కూడా విద్యార్థినులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్ మోసాలు, ఆన్‌లైన్ జాబ్స్ పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి అంశాలపై వివరణ ఇచ్చారు. అత్యవసర సేవల నంబర్లు 112, 1930, 1972 వినియోగం గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ – 1 ఆర్ఎస్సై కే సురేష్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగులకు.. పారిశుద్ధ కార్మికులకు వస్త్రాలు పంపిణీ



**గుడివాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** వాసవి జాగృతి క్లబ్ గుడివాడ మరియు హై 5. యూత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గుడ్లవల్లేరు ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు కొల్లిపర పార్థసారథి అనసూయ ల సహకారంతో సుమారుగా 160 మందికి బట్టలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కొల్లిపర సత్యనారాయణ సతీమణి సత్యవతి మనవడు సత్య వెంకట రాజేష్ ల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. తిరువీధి వేణుగోపాల్ ఆత్మీయ అతిథిగా ఎస్సై ఎన్‌వివి సత్యనారాయణ హై 5. యూత్ చైర్మన్ నాగబాబు ఆర్యవైశ్య ప్రముఖులు కంతేటి సుబ్బారావు పంచాయతీ సెక్రటరీ నరసంహారావు సభాధ్యక్షులుగా శేగు వెంకటప్రసాద్ –శేగు బబిత డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ గాదె మోహన్ బాబు కార్యదర్శి కంతేటి హరనాద్ బాబు క్లబ్ సభ్యులు చిట్టూరి కృష్ణ మోహన్ కుటుంబరావు క్లబ్ సభ్యురాలు జూపూడి సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మూలపాడు లో డ్రైను,సిసి నిర్మాణానికి శంకుస్థాపన



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 3 (వార్తాప్రభ) :** మూలపాడు గ్రామంలో 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న పక్కా డ్రైవ్ నిర్మాణానికి సోమవారం నాడు శంకుస్థాపన చేశారు కృష్ణాజిల్లా జెడ్పి వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి రాంబాబు. అదేవిధంగా గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి కూడా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూలపాడు గ్రామ సర్పంచ్ చింతల భూలక్ష్మి, మూలపాడు కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గరికపాటి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ గంజి నరసింహారావు, మూలపాడు గ్రామ టిడిపి గ్రామ అధ్యక్షులు మోరకొండ నాగేశ్వరరావు, మరియు ఇబ్రహీంపట్నం ఎండిఓ, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ, మరియు మూలపాడు గ్రామ పంచాయతీ సెక్రెటరీ అనిల్ పాల్గొన్నారు.

# శతాధిక విశ్రాంత ఉపాధ్యాయుడుకి పూర్వ విద్యార్థుల సన్మానం



**గుడివాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఎజికే పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిసిపాటి అనంత శాస్త్రి 100వ పుట్టినరోజు వేడుకలను ఏజీకే ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వివిధ హోదాల్లో ఉన్న ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు, పలువురు పూర్వ విద్యార్థులు విద్య నేర్పిన గురువు శత పుట్టినరోజు సందర్భంగా సోమవారం గౌరీశంకర పురంలోని ఆయన స్వగృహానికి తరలివెళ్లారు. తొలుత గురువు అనంత శాస్త్రి దంపతులకు పాద పూజ చేసిన పూర్వ విద్యార్థులు, వారి నుండి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అనంతశాస్త్రి దంపతులకు పట్టు వస్త్రాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. వేలాదిమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించడంలో అనంతశాస్త్రి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఏజికే పాఠశాల పూర్వ విద్యార్థులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ పాఠశాల చైర్మన్ చోడవరపు విజయ్ కుమార్, ఏ జీ కే పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు మరియు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ అర్బన్ బ్యాంక్‌కు సత్వరమే ఎన్నికలు నిర్వహించాలి..




**గుడివాడ,నవంబర్ 3 (వార్తాప్రభ) :** అత్యంత ప్రతిష్టాత్మకమైన గుడివాడ అర్బన్ బ్యాంకుకు సత్వరమే ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్సిపి రెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన బ్యాంకుకు కమిటీ లేకపోవడంతో వెలవెల బోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పిఎసిఎస్ లకు కమిటీలు వేశారన్నారు. ఇటీవల మచిలీపట్నం అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు జరిగాయనీ తెలిపారు. మరి గుడివాడ అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని, రాజకీయ వైరుధ్యాల కారణమని ప్రజలు భావిస్తున్నారని ఆర్ సి పి రెడ్డి పేర్కొన్నారు. బోర్డు లేకపోవడంతో వివిధ రకాల రుణాలు పొందేందుకు ప్రజలకు వేసులుబాటు తగ్గుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఎంతో అభివృద్ధి చెందిన అర్బన్ బ్యాంక్ కు నామినేటెడ్ ప్రక్రియలో కాకుండా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని ఆర్సిపి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకుడు రేపాని కొండ పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది

## -కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,నవంబర్ 3 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల నెహ్రూనగర్ బస్తీ దావఖానలో జన శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటిషన్ శిక్షణ కోర్స్ ఇన్స్టిట్యూట్ ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జన శిక్షణల ద్వారా ఉపాధి మార్గాలను ఎంచుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కార్పొరేటర్ సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో బ్యూటిషన్ శిక్షణ నేర్చుకునే మహిళలకు తన వంతు సహకారం ఎల్లపుడు అందిస్తానని హామీ ఇచ్చారు. బస్తీ దవఖానాలోని పై ఫ్లోర్ లో బ్యూటిషన్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కు వెసులుబాటు కల్పించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కి జన శిక్షణ సంస్థాన్ వారు శిక్షణ పొందే మహిళలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ రాంమోహన్ రెడ్డి, ప్రోగ్రామ్ అసోసియేట్ స్వప్న రెడ్డి, వహీద్, టీచర్ ఇర్ఫాన, తన్వీర్ బేగం, మహేందర్ సింగ్, జగదీశ్, సర్వేష్ కుమార్, షబాజ్, సంపత్, జన శిక్షణా సంస్థాన్ సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్ధులు తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ ఛాంపియన్ సీతారామయ్యను అభినందించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఇటీవల గుంటూరు లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 8 వ ఇంటర్ డిస్ట్రిక్ట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 2 బంగారు మరియు 2 సిల్వర్ పథకాలు సాధించిన మాజీ సైనికుడు సీతారామయ్య ను శాలువతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించిన పిఏసీ చైర్మన్ ఆరెక పూడి గాంధీ. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, శర్మ, గుమ్మడి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రాంచందర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలోయ ప్రతిఘటన పోరాటమే అజేయం

● ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావ ● పీఓడబ్ల్యూ(విముక్తి) ఎం.పుణ్యవతి అధ్యక్షతన జరిగిన కామ్రేడ్ సిపిరెడ్డి 41 వ వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం



**జవహర్ నగర్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నగ్జల్ బరి, శ్రీకాకుళ పోరాటాల వెల్లువలో నేటి భారత విప్లవోద్యమానికి గోదావరిలోయ రైతాంగ ప్రతిఘటన పోరాటం మాత్రమే దిక్సూచికగా నిలిచిందని, నేడు అది ఇతర విప్లవ సంస్థల సిద్ధాంతాలకు, ఆచరణకు ప్రత్యన్మాయ పంథాగా ముందుకు వచ్చిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జాతీయ కన్వీనర్ షేక్ షావలి కొనియాడారు. ప్రతిఘటన పోరాట సిద్ధాంత నిర్మాత, ఆచరణవాది కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి లైన్ మాత్రమే నిలకడగా రాణించి, నేటి పరిస్థితులకు తగ్గట్టుగా ఎన్నో అనుభవాలను, గుణపాఠాలను భారత విప్లవకారులకు అందించిన పంథా మరొకటి లేదని పేర్కొన్నారు. 2025, నవంబర్-3, సోమవారం రోజున, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల మోహన్ రావు కాలనీలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ-విముక్తి) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ మెరుగు పుణ్యవతి అధ్యక్షతన నల్గొండ జిల్లా, నకిరేకల్ పట్టణంలో, నవంబర్-9 న జరిగే కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి 41 వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ షావలి ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 1 నుండి 30 వరకు సమసమాజ నిర్మాణంలో భాగంగా గ్రామగ్రామాన భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి పోరులో వందలాది మంది తమ ప్రాణాలు అర్పించిన అమరుల సంస్మరణ సభలు, సమావేశాలు మరియు సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి, కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో జరిగే సిపిరెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈపై కార్యక్రమంలో షేక్ షావలి, పుణ్యవతి తోపాటు పీఓడబ్ల్యూ(విముక్తి) రాష్ట్ర కన్వీనర్ పి.సునీత తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కాంగ్రెస్ సమర శంఖారావం..

● ప్రత్యేకమైన మీటింగ్ లో మంత్రులతో కలిసి పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.

●జూబ్లీహిల్స్ బైపోల్లో కాంగ్రెస్ కైవసం ఖాయం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.





**ఎల్బీనగర్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా యూసుఫ్‌గూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం డోర్ టూ డోర్ ప్రచారాన్ని వేగవంతం చేయాలని, ప్రజాపాలన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఎన్ఆర్ మాట్లాడుతూ...జూబ్లీహిల్స్ బైపోల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని అన్నారు.

## కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం..

- హాజరుకానున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..





**ఎల్బీనగర్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో ఈ నెల 5న కార్తీక పౌర్ణమి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి లను హాజరుకావాలని ఆలయ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఈవో లావణ్య ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ ధర్మకర్త మధుసాగర్, చైతన్యపురి డివిజన్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు బస్సు ఘటన మరవక ముందే చేవెళ్ల బస్సు ఘటన జరగడం అత్యంత బాధాకరం

● బయటికి వెళ్లినవారు ఇంటికి క్షేమంగా తిరిగి వస్తారని గ్యారెంటీ లేని జీవితాలు మనవి

● బి.అర్.ఎస్.నేత ముచ్చెర్ల ఆంజనేయులుయాదవ్ ఆవేదన



**హైదరాబాద్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** ఎన్నో ఆశలు ఎన్నో ఆలోచనలతో తమ యొక్క ప్రయాణాన్ని మొదలుపెట్టి ఇలా రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా విషాదకరం!అసలే ఉరుకు, పరుగెత్తే జీవన విధానానికి అలవాటు పడ్డ మనిషి జీవితంలో ఇలాంటి రోడ్డు ప్రమాదాలు ఈ మధ్యకాలంలో చాలా ఎక్కువైన పరిస్థితి ఒక లారీ డ్రైవర్, ఒక బస్సు డ్రైవరు ఇద్దరిలో ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించినా కూడా బస్సులో ప్రయాణిస్తున్న ప్రజలందరి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. కాబట్టి ప్రభుత్వాలు వెంటనే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే వాటికి తగిన విచారణ జరిపి, రోడ్డు ప్రమాదాలను అరికట్టే విధంగా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ.. ఈ ఘటనలో గాయాల పాలైన వారికి నాణ్యమైన చికిత్స అందించాలని అలాగే మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, మరణించిన వారి ఆత్మ శాంతించాలని, వారి కుటుంబాలకు దేవుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతూ శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం బల్కంపేట్ మాజీ ధర్మకర్త మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వనభోజన కార్యక్రమంలో అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన




**కుత్బుల్లాపూర్,నవంబర్ 3 (వార్తాప్రభ) :** కార్తీక మాసం పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ హెచ్ఎంటి కాలనీ లో శ్రీ కామాక్షి విశ్వకర్మ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఆదివారం వన భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సహస్ర నిత్య బృందం చేసిన నృత్య ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకున్నది. చిన్నారులు వివిధ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. నిర్వాహకులు వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సభ్యులు ముకుంద చారి, శేఖర్ చారి, అశోక్ కుమార్,కిరణ్ చారి, శశాంక్ చారి, హేమలత, వాణి, లాస్య,భారతి, రేణుక,సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# యు.టి.ఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు, నవంబర్ 3 (వార్తాప్రభ) :**గిద్దలూరు పట్టణంలోని ముత్తుముల భాస్కర్ రెడ్డి కళ్యాణ మండపంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మండలాధ్యక్షులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్య అధ్యక్షత వహించారు. మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు వేదిక పైకి అతిథులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గారు హాజరై 80 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. మెగా డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయులుగా నియమితులైన వారిని, ఇటీవల పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులను, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను, ఇటీవల జరిగిన బదిలీలల్లో ఇతర మండలాలకు వెళ్ళిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఇతర మండలాల నుంచి ఈ మండలానికి వచ్చిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంతో పవిత్రమైందని, ప్రతి ఉపాధ్యాయుడు ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేస్తూ, సమాజంలో మంచి గుర్తింపు పొందుతున్నారన్నారు. విద్య అనేది ఎవరు దొంగలిచలేని, తరిగిపోని గొప్ప సంపదని, అక్షరాస్యతను పెంచి మూఢనమ్మకాలను దూరం చేసే బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందన్నారు . సంఘ అభివృద్ధికి కృషి చేసిన చెన్నుపాటి లక్ష్మయ్య, వెంకటరత్నం, అప్పారి వెంకటస్వామి, దాచూరి రామిరెడ్డి లాంటి గొప్ప వ్యక్తుల త్యాగాలను గుర్తు చేశారు. టెట్ పరీక్ష నుండి ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వమని వినతి పత్రాన్ని ఎమ్మెల్యే కి కమిటీ సభ్యులు అందజేశారు. అనంతరం గిద్దలూరు మండల కమిటీ సభ్యులందరూ ఎమ్మెల్యే గారిని శాలువా, పులమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన గిద్దలూరు మండల విద్యాశాఖ అధికారి అశ్విని కుమార్ ఉపాధ్యాయుల బాధ్యతల గురించి ప్రసంగించారు. జిల్లా ఉపాధ్యక్షులు రామిరెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు మండల శాఖ 376 సభ్యత్వం చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం ప్రశంసనీయమని, ఈ కార్యక్రమానికి 300 మంది ఉపాధ్యాయులు హాజరు కావడం అభినందనీయమని, ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సంఘం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులందరూ కుటుంబ సంక్షేమ పథకంలో చేరాలన్నారు. జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందని, నిబద్ధతగల యూనియన్ అని అన్నారు. మండల గౌరవాధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను ఇప్పించడానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి రంగ సుధా, నాగమణి, ఉపాధ్యక్షులు ఖాదర్, ట్రెజరర్ సుబ్బరాయుడు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, సంఘ నాయకులు రామచంద్రారెడ్డి, ఆవులరాజు, బాల వెంకటేశ్వర్లు, మస్తాన్ హకీం, జీవన్, కొమరోలు , రాచర్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియు మండల సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

## డిజిటల్ లైవ్ సర్టిఫికెట్ల కొరకు స్పెషల్ డ్రైవ్!!

● రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు అవకాశం వినియోగించుకోండి

● సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని,నవంబర్ 3 (వార్తాప్రభ) :** పెన్షనర్లు తమ పెన్షన్ పొందడం కొనసాగించడానికి ప్రతి సంవత్సరం నవంబర్‌లో తమ జీవిత ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలి అని సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిఎం కార్యాలయంలో సీఎంపిఎఫ్ సహకారంతో డిజిటల్ లైవ్ సర్టిఫికెట్ రెండు రోజుల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు అవకాశం వినియోగించుకోవాలని కోరారు. డిమాండ్ నేపథ్యంలో మరో 15 రోజులు ప్రత్యేక క్యాంపు పొడగిస్తున్నట్లు తెలిపారు.

## చెరుకుపల్లి భరత్ రెడ్డి చేతుల మీదుగా శుభారంభం

● దేవకి లేడీస్ బ్యూటీ పార్లర్ మరియు కన్సల్టేన్సీ అబ్రాడ్ జాబ్స్&ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, నవంబర్ 3, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి గార్డెన్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన దేవకి లేడీస్ బ్యూటీ పార్లర్, కన్సల్టేన్సీ అబ్రాడ్ జాబ్స్ & ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో సోమవారం బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి కన్సల్టేన్సీ సెంటర్ ను ప్రారంభించారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా "దేవకి కన్సల్టెన్సీ, " అబ్రోడ్ జాబ్స్ & ఎడ్యుకేషన్ పనిచేయాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 3, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 -జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని గార్డెన్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన "దేవకీ కన్సల్టెన్సీ అబ్రోడ్ జాబ్స్ & ఎడ్యుకేషన్" "దేవకి ఇన్సా సర్వీస్" "దేవకి పార్లర్" కార్యాలయాలను సోమవారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా "దేవకి కన్సల్టెన్సీ " అబ్రోడ్ జాబ్స్ & ఎడ్యుకేషన్ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, గార్డెన్ బస్తీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నీరుడు రాజేష్, సలహాదారులు జి. సత్యనారాయణ, కాలనీ వాసులు నర్సింగ్ రావు, ఉమామహేశ్వర్, ఎం.శ్రీనివాస్, సిహెచ్. సురేష్, సందీప్, భరత్, సాయి, మహేశ్వర్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు నల్ల ప్రసాద్, కుంట వేణు, నల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, టీఆర్ఎస్ మోసాలను వివరిస్తూ ప్రచార పర్వం నిర్వహించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,నవంబర్ 3 (వార్తాప్రభ):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా షేక్ పేట్ డివిజన్ లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి కీ మద్దతుగా నిర్వహించిన మహా పాదయాత్ర లో రామగుండం నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే కందుల సంధ్యా రాణి,రంగారెడ్డి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్,జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ ముకేష్ గౌడ్,నాంపల్లి కంటెస్టెడ్ కార్పొరేటర్ కేశవ్ తో కలిసి ముఖ్య అతిథిగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.ఆప్యాయత పలంకరింపులతో ప్రజలు ఘనస్వాగతం పలకగా.. వారి సమస్యలు తెలుసుకుంటూ,కాంగ్రెస్,బీఆర్ఎస్ మోసాలను వివరిస్తూ పాదయాత్ర సాగింది.జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పట్టకుండా కేవలం అవకాశవాద రాజకీయాలతో బీఆర్ఎస్,కాంగ్రెస్ నాయకులు ఎలా మజ్లిస్ నాయకత్వానికి సాగిలా పడుతున్నారో వివరించాను.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుండి ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనీ కూడా చేయలేదనీ అన్నారు, ఆరు గ్యారెంటీ లు అని గద్దెనెక్కిన కాంగ్రెస్ ను గద్దె దించాలని ప్రజలను కోరారు.పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ ది కూడా అదే పరిస్థితి అని ఆరోపించారు.హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చి వేసి నానా ఇబ్బందులకు గురి చేసిన కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు.తులం బంగారం అని గ్యారంటీ కార్డులు ఇచ్చి ప్రజలను మోసం చేశారు.ఇప్పుడు తులం బంగారం ఇవ్వకపోగా,ప్రజల మెడలో ఉన్న గొలుసు కూడా లాక్కుంటున్నారు.ఫ్రీ బస్ అని చెప్పి భార్యకు ఉచితం ఇచ్చి,భర్త నుంచి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారు.రేవంత్ రెడ్డి కి పదవి ఇచ్చింది ప్రజలే కానీ ఆయన ప్రజా సేవను మరిచి రాజులా ఫీలవుతున్నారు.జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ అహంకారానికి చెక్ పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు.రియల్ ఎస్టేట్ నాశనం చేశారు,పేదల ఇళ్లు కూలగొడుతున్నారు.హైడ్రా, బుల్డోజర్ పేరుతో బలహీన వర్గాలపై జులుం చూపిస్తున్నారు.ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదు అన్ని అన్నారు.420 హామీలు ఇచ్చి మోసం చేశారు.బీసీ,ఎస్సీ డిక్లరేషన్లు కాగితాలకే పరిమితమయ్యాయి.రేవంత్ రెడ్డి ప్రజల సొమ్మును ధర్మకర్త సొత్తుగా భావిస్తున్నారు.ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు.ఈసారి జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ మోసాలకు గట్టి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని, స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎలప్పుడూ సిద్ధంగా ఉండే బీజేపీ పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ని నవంబర్ 11న జరగబోయే ఉప ఎన్నికల్లో మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశాను.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివసింగ్ రాందీన్,సీనియర్ నాయకులు వరలక్ష్మి ధీరజ్,తిరుపతి, రంగస్వామి, ప్రసాద్, మురుగ, రాజు, యాదయ్య, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్,డివిజన్ అధ్యక్షులు,పోలింగ్ బూత్ ముఖ్య సభ్యులు,సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు,స్థానిక నేతలు కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నేత శ్రీనివాస్ రెడ్డి



**కీసర, నాగారం,నవంబర్ 3 (వార్తాప్రభ) :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని దత్త సాయి పేస్ 2 కాలనీ వాసుల పిలుపు మేరకు నూతన డ్రైనేజీ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని డ్రైనేజీ పనులను ప్రారంభించిన నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మరియు మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి, ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుధీర్, కేశవరెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## దివంగత తన్నీరు సత్యనారాయణకు ఘన నివాళులర్పించిన రవీందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,నవంబర్ 3 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి హరీష్ రావును శేరిలింగంపల్లి యువనేత, భారాస సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పరామర్శించారు. కోకాపేట్ లోని క్రిన్స్ విల్లాలోని ఆయన నివాసంలో కలిసి రవీందర్ యాదవ్ వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.ఇటీవల తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు.ఈ సందర్భంగా తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన రవీందర్ యాదవ్ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని వెల్లడించారు. అలాగే హరీష్ రావు సోదరుడు మహేష్ ను సైతం కలిసి సానుభూతిని తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188